మీ గళం..మా కళం...

# నమస్తే హైదరాబాద్

NAMASTHE HYDERABAD

తెలుగు దిన పత్రిక

RNI No: APTEL/2012/45237

| రంగారెడ్డి | ఆదివారం | 21-12-2025 | సంపుటి : 14 | సంచిక :195 | పేజీలు :8 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|
| RangaReddy | Sunday | 21-12-2025 | Volume :14 | Issue:195 | Pages:8 | Cost : 3 |

విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ విశేష ప్రజాధరణ పొందుతున్న

నమస్తే హైదరాబాద్

తెలుగు దిన పత్రికకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో విలేకరులు కావలెను.

సీనియర్లకు ప్రాధాన్యం

కొత్తవారికి అవకాశం

Ph: 9912580066

## క్రిస్మస్ వేడుకల్లో సీఎం

# డిసెంబర్ మిరాకిల్ మంత్...



**హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే హైదరాబాద్) :** ద్వేషించే వారిని కూడా ప్రేమించేలా ఏసు ప్రభువు చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించడానికి ఏసు ప్రభువు జన్మించారన్న సీఎం కాంగ్రెస్ పార్టీకి కూడా డిసెంబర్ నెల కీలకమైందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ కూడా డిసెంబర్ నెలలోనే జన్మించినట్లు గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్న వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ పాల్గొన్నారు. వీరితో పాటు మంత్రుల పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు.

తెలంగాణలో క్రిస్మస్ జరుపుకుంటున్నామంటే అందులో సోనియాగాంధీ పాత్ర, త్యాగం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇదే డిసెంబర్‌లో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. ఏసు ప్రభువు బోధనల స్ఫూర్తితో తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. శాంతిని కాపాడుతూనే సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు.

**పేదల ఇళ్లలో వెలుగులు నింపాం :** పేదవాడి ఆకలి తీర్చాలని ఆనాడు కాంగ్రెస్ పార్టీ ఆహార భద్రత చట్టం తెచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి



అన్నారు. తెలంగాణలో ప్రతి పేదవాడికి నెలకు 6 కిలోల సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. ఉచిత విద్యుత్ పథకం ద్వారా పేదల ఇళ్లలో వెలుగులు నింపామన్నారు. రెండేళ్లలో వ్యవసాయంపై రూ.1.04 లక్షల కోట్లు ఖర్చుపెట్టినట్లు తెలిపారు. క్రిస్టియన్ మిషనరీలు ప్రభుత్వంతో పోటీ పడి విద్య, వైద్యం అందించాయని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు మనిషి సగటు జీవన ప్రమాణం 32 ఏళ్లుగా ఉంటే ప్రస్తుతం 72 ఏళ్లకు చేరుకున్నామంటే ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత ప్రయత్నం చేశాయో అంతే సమానంగా క్రిస్టియన్ మిషనరీస్ సంస్థలు కృషి చేశాయని సీఎం అన్నారు.

"ఎవరి మతాన్ని వాళ్లు ఆచరించుకుంటూనే ఇతర మతాలను గౌరవించే విధంగా ఈరోజు పరిపాలనను కొనసాగిస్తున్నాం. నాకు నచ్చిన మతాన్ని నేను ఆచరించవచ్చు. అదే సమయంలో ఇతర మతాలను గౌరవించే వాతావరణాన్ని ఈ రాష్ట్రంలో తీసుకువచ్చాం. మతపరమైన దాడులు ఎవరైనా చేయాలని ఆలోచన చేసిన్నా, అనుకోని చెదురుమదురు సంఘటనలు జరిగినా ప్రభుత్వం వాటిని కఠినంగా అణిచివేసింది. అలాంటి వారి పట్ల మా ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. త్వరలోనే అసెంబ్లీలో హేట్‌రేట్ స్పీచ్‌పైనా చట్టం తీసుకువస్తాం. ఇతర మతాలను కించపరిచే విధంగా ఎవరైనా మాట్లాడితే చట్ట పరిధిలో వారిని శిక్షించేలా చేస్తాం. ఆ తరహాలోనే కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ చట్టాన్ని తీసుకువ చ్చింది"
–రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

మైనార్టీలకు ప్రభుత్వం అందించే సంక్షేమం దయ కాదని అదీ వారి హక్కు అని సీఎం రేవంత్ తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్ లకు సంబంధించిన స్మశానాలకు స్థలం ఇవ్వాలంటే ప్రభుత్వం వద్ద లేదని ఊరికి దూరంగా స్మశానాలు నిర్మించుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. అన్ని మతాల పట్ల తాము సమానంగా ఉంటామన్న సీఎం ఇతర మతాలను కించపరిచేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశంలో హెట్ రేట్ చట్టం ప్రవేశపెడతామని చెప్పారు.

**క్రిస్మస్ వేడుకల కోసం రూ.33 కోట్ల నిధులు :** సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని మతాలు, వర్గాల ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని మంత్రి అజారుద్దీన్? అన్నారు. క్రిస్మస్ వేడుకలను సీఎం ఘనంగా జరిపిస్తున్నారని తెలిపారు. మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం కోసం ఆయన చేస్తున్న మేలుకు ఎప్పుడూ అండగా ఉంటూ మద్దతూ ఇస్తామని అన్నారు. క్రిస్మస్ వేడుకల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.33 కోట్ల నిధులు కేటాయించినట్లు క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్ వెల్లడించారు. రూ.30 వేల చొప్పున రాష్ట్రంలోని 7 వేల చర్చిలకు నిధులు అందుతాయని తెలి పారు.

## బెంగాల్‌ను జంగిల్ రాజ్ నుంచి విముక్తి చేయాలి:



**డిసెంబర్ 20 (నమస్తే హైదరాబాద్) :** జంగిల్ రాజ్ నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ బెంగాల్‌లో పర్యటించారు. ప్రధాని పశ్చిమ బెంగాల్‌లోని తాహేర్‌పూర్‌కు వెళ్లారు. ప్రతికూల వాతావరణం కారణం వల్ల హెలికాప్టర్ ల్యాండింగ్ సాధ్యం కాలేదు.

కొద్దిసేపు హెలిప్యాడ్‌పై చక్కర్లు కొట్టి కోల్‌కతా ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. ప్రధాని ఎయిర్‌పోర్టు నుంచి వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాని బంకిం చంద్ర ఛటర్జీకి నివాళులర్పించారు. వందేమాతరం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి మంత్రమని కొనియాడారు. వందేమాతరాన్ని దేశ నిర్మాణానికి మంత్రంగా మార్చాలని కోరారు.

చొరబాటుదారులకు టీఎంసీ నుంచి రక్షణ..

కేంద్రం దేశ పౌరులతో భుజం భుజం కలిపి నడుస్తోందన్నారు. జీఎస్టీ బెంగాల్‌తోపాటు దేశవ్యాప్తంగా ప్రజలకు గొప్ప ఉపశమనం ఇచ్చిందని పేర్కొన్నారు. దుర్గాపూజ, ఇతర పండుగల సమయంలో దేశవ్యాప్తంగా ప్రజలు ప్రయోజనం పొందారని తెలిపారు. బెంగాల్‌లో చొరబాటుదారులకు టీఎంసీ పార్టీ రక్షణ లభిస్తోందని ఆరోపించారు. గంగానది బీహార్ మీదుగా బెంగాల్‌కు ప్రవహిస్తుందని తెలిపారు. బీహార్ బెంగాల్‌కు మార్గం చూపిందన్నారు.

రాష్ట్రానికి నిధుల కొరత లేదు..

బెంగాల్‌ను జంగిల్ రాజ్ నుంచి విముక్తి చేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. తాను బెంగాల్ ప్రజలకు మనస్ఫూర్తిగా అంకితమయ్యానని చెప్పారు. రాష్ట్రానికి నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో అనేక అభివృద్ధి ప్రాజెక్టులు రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కారణంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బీజేపీని వ్యతిరే కించాలనుకుంటే టీఎంసీ వ్యతిరేకించ

2 లో

## గ్రామీణ పేదల హక్కులను కాలరాస్తున్నారన్న సోనియా



**డిసెంబర్ 20 (నమస్తే హైదరాబాద్) :** కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంపై కేంద్ర ప్రభుత్వం పద్ధతి ప్రకారం బుల్డోజర్ నడుపుతోందని ఆమె శనివారం ఆరోపించారు. ఇది గ్రామీణ పేదలు,

2 లో

## 18 మంది ఎమ్మెల్యేలపై సీఎం సీరియస్!!



**హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే హైదరాబాద్) :** తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల అనంతరం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఎన్నికల ఫలితాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్, పాలమూరు, నల్గొండ జిల్లాల 18 మంది ఎమ్మెల్యేల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. రెబల్స్‌ను బుజ్జగించకపోవడం, సొంత బంధువులకు టికెట్లు ఇచ్చి పార్టీకి నష్టం కలిగించారని ఆరోపించారు. భవిష్యత్తులో ఇలా జరిగితే సహించేది లేదని సీఎం హెచ్చరించారు. త్వరలో పీసీసీ చీఫ్, మంత్రులతో సీఎం లంచ్ మీటింగ్ నిర్వహించి, మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, అసెంబ్లీ సమావేశాలపై చర్చించనున్నారు.

## రేవంత్ రెడ్డి సర్కార్‌కి హనీమూన్ ముగిసింది: కేటీఆర్

**హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే హైదరాబాద్) :** రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డి సర్కార్‌కి హనీమూన్ ముగిసిందంటూ ఆయన ఎద్దేవా చేశారు. శనివార తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సంద్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ..' రేవంత్.. ఎవరితో ఫుట్‌బాల్ ఆడుకుంటాడో నాకు తెలియదు. నేను మాత్రం రేవంత్ రెడ్డిని ఫుట్‌బాల్ ఆడుకుంటాను. రేవంత్ ఇంట్లోని మహిళలను,



పిల్లలను, మనుమడి గురించి నేను మాట్లాడను.

రేవంత్ రెడ్డి మాదిరి కుటుంబ సభ్యుల విషయంలో నేను చిల్లర రాజకీయాలు

2 లో

## హైదరాబాద్‌లో కొనసాగుతున్న రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పర్యటనలు...

**హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే హైదరాబాద్) :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హైదరాబాద్‌లో పర్యటిస్తున్నారు. ద్రౌపది ముర్మ్ము నిన్ననే నగరానికి రాగా.. ఈరోజు(శనివారం) సీపీ రాధాకృష్ణన్ చేరుకున్నారు. ఇవాళ మధ్యాహ్న సమయంలో శంషాబాద్ విమానాశ్రయానికి ఆయన చేరుకోగా.. మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు ఘనస్వాగతం పలికారు. నేడు జరిగే పబ్లిక్ సర్వీస్ కమిషనర్ల ముగింపు సదస్సులో ఉప రాష్ట్రపతి పాల్గొనున్నారు. మరోవైపు శీతాకాల విడిది కోసం వచ్చిన రాష్ట్రపతి.. రామోజీ ఫిల్మ్‌సిటీలో నిన్న జరిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్(పీఎస్సీ) ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈరోజు గచ్చిబౌలిలో బ్రహ్మ కుమారిస్ శాంతి సర్వోవర్‌ను



ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి సీతక్క రాష్ట్రపతి ముర్మకి ఘనస్వాగతం పలికారు. బ్రహ్మ కుమారిస్ 21వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మొక్కలు నాటారు. కాగా, రెండ్రోజుల పర్యటన సందర్భంగా నేడు హైదరాబాద్‌కు చేరుకున్న ఉపరాష్ట్రపతి.. నేరుగా రామోజీ ఫిల్మ్ సిటీకి వెళ్లనున్నారు. అక్కడ నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఛైర్‌పర్సన్ల సమావేశ ముగింపు సెషన్‌లో ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు. ఈ కార్యక్రమం అనంతరం రాజ్‌భవన్‌కి వెళ్లి రాత్రికి అక్కడే బస చేయనున్నారు.

ఆదివారం ఉదయం శ్రీ రామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కన్హా శాంతి వనంలో నిర్వహించే వరల్డ్ మెడిటేషన్ డే కార్యక్రమానికి ఆయన హాజరవుతారు. అనంతరం ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ నేరుగా ఢిల్లీకి బయలుదేరుతారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పర్యటనల నేపథ్యంలో తెలంగాణ, హైదరాబాద్ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## పరీక్షలకు వార్షిక జాబ్ క్యాలెండర్ తప్పనిసరి



**హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే హైదరాబాద్) :** పబ్లిక్ సర్వీస్ కమిషన్లుదేశ పరిపాలనా వ్యవస్థకు వెన్నెముకలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. న్యాయమైన, పారదర్శక నియామకాల ద్వారానే ప్రజాసేవలో ప్రతిభకు స్థానం ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ఏర్పాటు చేసిన 26వ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పరీక్షలకు వార్షిక జాబ్ క్యాలెండర్ తప్పనిసరని అన్నారు. ఉద్యోగ నియామకాల జాప్యం యువత భవిష్యత్తును దెబ్బతీస్తాయని.. ముందస్తు

2 లో

## మంత్రి కీలక ఆదేశాలు

**హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే హైదరాబాద్) :** రాష్ట్రంలో వైద్య విద్య ప్రమాణాల పెంపు, పరిశోధనలకు పెద్దపీట వేస్తూ వైద్యారోగ్య శాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పీజీ, సూపర్ స్పెషాలిటీ సీట్ల సంఖ్యను పెంచేందుకు తక్షణ చర్యలు

2 లో



## సీఎంకు కిషన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్

**హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే హైదరాబాద్) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శనివారం ఏబీఎన్–ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. పసలేని, తెలివి తక్కువ వాళ్ళు బీఆర్ఎస్‌తో బీజేపీకి పొత్తు ఉందని మాట్లాడుతారని మండిపడ్డారు. ఎవరితో బీజేపీ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ.. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై అడిగితే తప్పేంటి ప్రశ్నించారు. గతంలో సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితిపై కూడా అడిగారని గుర్తుచేశారు. పసలేని వాళ్లు తమ మీద ఆరోపణలు చేస్తే జవాబు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. రాజకీయ విమర్శలు మాని ప్రజలకు మేలు చేసే పనులు



చేయాలని హితవుపలికారు. ఆదాయం వ్యక్తిగత అవసరాల కోసం జీహెచ్ఎంసీలో మునిసిపాలిటీలు , కార్పొరేషన్ల విలీనం చేశారని.. దీనిపై మొదటి నుంచి బీజేపీ అభ్యంతరం చెబుతోందన్నారు. గ్రామాల్లో గెలిచిన సర్పంచ్‌లను డబ్బు ఆశ , ఇతర అంశాలను సాకుగా చూపి కాంగ్రెస్

2 లో

# బెంగాల్‌ను జంగిల్ రాజ్ నుంచి విముక్తి చేయాలి: ప్రధాని మోదీ పిలుపు


వచ్చున్నారు. రాజకీయ లబ్ధి కోసం అభివృద్ధిని అడ్డుకోవడం అర్థరహితం అన్నారు.డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి.. బీజేపీకి ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. డబుల్ ఇంజిన్ సర్కారును ఏర్పాటు చేయాలని ప్రధాని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉంటుందని హామీనిచ్చారు. ఈ సందర్భంగా మోదీ రూ.3200 కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రారంభించారు. నదియా జిల్లాలోని జాతీయ రహదారి-34లోని బర్జగులి-కృష్ణానగర్ సెక్షన్‌కు చెందిన 66.7 కిలోమీటర్ల పొడవైన నాలుగు లేన్ల రహదారిని ప్రారంభించారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బరాసత్-బర్జగులి సెక్షన్‌కు చెందిన 17.6 కిలోమీటర్ల పొడవైన నాలుగు లేన్ల రహదారికి శంకుస్థాపన చేశారు.

# మంత్రి కీలక ఆదేశాలు

చేపట్టాలని అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ కాలేజీల పనితీరుపై ఎంసీఎంసీ కమిటీలు ఇకపై ప్రతి నెలా నివేదికలు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చే విద్యార్థులకు భాషాపరమైన ఇబ్బందులు లేకుండా 'స్పోకెన్ ఇంగ్లీష్'లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఎంబీబీఎస్ ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఇంగ్లీష్ క్లాసులు నిర్వహించడంతో పాటు, ఇందు కోసం ప్రత్యేక టీచర్ల నియామకానికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేటు కాలేజీల్లో కన్వీనర్ కోటా విద్యార్థుల నుంచి హాస్టల్, మెస్ పేరుతో అదనపు ఫీజుల వసూళ్లపై నిఘా పెంచాలని ఆదేశించారు. అలాగే ప్రైవేట్ కాలేజీల్లో విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులు, యాజమాన్యాల తీరుపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెడికోల ఆత్మహత్యల నివారణకు కాలేజీల్లో సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులతో కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పెరిగిన కాలేజీలకు అనుగుణంగా కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచ్ పటిష్టం చేయడంతో పాటు సిబ్బంది పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతేకాకుండా హెల్త్ యూనివర్సిటీ సేవలను వేగవంతం చేసేలా కార్యకలాపాలన్నీ పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించారు. అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్, లైబ్రరీలు, స్కిల్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచనలు చేశారు.

# బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన వార్డు మెంబర్

**కందువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఝాన్సీ రెడ్డి**



**దేవరుప్పుల( నమస్తే హైదరాబాద్):** దేవరుప్పుల మండలం నల్లకుంట తండ కాంగ్రెస్ పార్టీ ఉపసర్పంచ్ బానోత్ భాస్కర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసు ఆధ్వర్యంలో శనివారం బిఆర్ఎస్ పార్టీ నుండి ఐదవ వార్డ్ నెంబర్ బానోత్ రాజు, బిఆర్ఎస్ పార్టీ గ్రామ యూత్ అధ్యక్షుడు బానోత్ సురేష్, పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఝాన్సీ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజలకు ఇస్తున్న సంక్షేమ పథకాలు చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు, పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తోనే ప్రతి గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంగ్య నాయక్ ,కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

# వాటర్ హీటర్ ఓవర్‌హీట్.. హైదరాబాద్‌లో ఇల్లు బూడిద, జాగ్రత్తలు పాటించండి!

చలికాలం వచ్చిందంటే చాలా మంది ఇళ్లలో వాటర్ హీటర్ (గీజర్) ఉపయోగించడం సాధారణం అవుతుంది. వెచ్చని నీటి సౌకర్యం కోసం ఇది అనివార్యమైనప్పటికీ, సరైన జాగ్రత్తలు లేకుండా ఉపయోగిస్తే పెను ప్రమాదాలు సంభవించవచ్చు. నిర్లక్ష్యం వల్ల ఆస్తి నష్టం కాకుండా ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లవచ్చు. ఇటీవల హైదరాబాద్‌లోని నల్లకుంట ప్రాంతంలో జరిగిన ఘటన దీనికి స్పష్టమైన ఉదాహరణ.

తాజాగా హైదరాబాద్ నల్లకుంటలో ఒక ఇంట్లో వాటర్ హీటర్ అతిగా వేడెక్కి పేలిపోయింది. ఈ పేలుడు వల్ల మంటలు వ్యాపించి మొత్తం ఇల్లు బూడిదగా మారిపోయింది. అదృష్టవశాత్తు ఇంట్లో ఉన్నవారు సమయానికి బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. లేకపోతే ఘోర పరిణామాలు జరిగేవి. ఇలాంటి ఘటనలు చలికాలంలో తరచుగా వినిపిస్తుంటాయి, ముఖ్యంగా పాత హీటర్లు లేదా తప్పుడు వైరింగ్ వల్ల.

వాటర్ హీటర్ సురక్షితంగా ఉపయోగించాలంటే కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు పాటించడం అవసరం. ముందుగా హీటర్ చుట్టూ కనీసం 50 సెంటీమీటర్ల ఖాళీ స్థలం ఉంచండి, అక్కడ దుస్తులు, ప్లాస్టిక్ ఐటెమ్స్ లేదా ఎలక్ట్రానిక్ వస్తువులు పెట్టకూడదు. వైరింగ్‌లో ఏ చిన్న సమస్య కనిపించినా వెంటనే ఎలక్ట్రీషియన్‌ను పిలిచి రిపేర్ చేయించండి.

అలాగే హీటర్ ఉపయోగించిన తర్వాత స్విచ్ ఆఫ్ చేయడం మరచిపోకండి, ముఖ్యంగా ఇంటి నుంచి బయటకు వెళ్తున్నప్పుడు డబుల్ చెక్ చేయండి. నాణ్యమైన హీటర్లు కొనుగోలు చేయండి మరియు సకాలంలో సర్వీసింగ్ చేయించుకోండి. ఈ చిన్న జాగ్రత్తలు పాటిస్తే పెద్ద ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చు. చలికాలం ఆనందంగా గడపాలంటే సురక్షితంగా ఉండటమే ముఖ్యం!

# రేవంత్ రెడ్డి సర్కార్‌కి హనీమూన్ ముగిసింది: కేటీఆర్

చేయను. రేవంత్ రెడ్డి సర్కార్ కు హనీమూన్ ముగిసింది. ఇక కేసీఆర్ ప్రజల్లోకి వస్తారుకేసీఆర్ రేపు(ఆదివారం) అన్ని విషయాలపై దిశానిర్దేశం చేస్తారు. లోకల్ బాడీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ మెంబర్ షిప్ కార్యక్రమం ఉంటుంది. కేసీఆర్ బహిరంగ సభలపై రేపటి సమావేశంలో నిర్ణయం ఉంటుంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు...కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ లో ప్రెస్ మీట్ పెట్టి.. బీఆర్ఎస్ లోనే ఉన్నామనటం పెద్ద కామెడీగా ఉంది. పంచాయతీ ఎన్నికల విషయంలో రేవంత్ చెప్తోన్న 66శాతం నిజమైతే.. పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి బైపోల్స్ కు రావాలి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెండ్ గా నేను ఫెయిల్ కాదు. నేను వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక32జిల్లా పరిషత్, 136మున్సిపాలిటీలు గెలిచాము. రేవంత్ సీఎం అయ్యాక.. సొంత పార్లమెంట్ స్థానాన్ని కూడా గెలిపించలేదు. నేకు ఐరన్ లెగ్ కాదు.. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలే ఐరన్ లెగ్‌లు. పంచాయతీ ఎన్నికల దెబ్బకు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ఇప్పట్లో నిర్వహించరు. మొదట మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తారు. అలానే గ్రేటర్‌లో మున్సిపాలిటీల విలీనం సక్రమంగా జరగలేదు. జీహెచ్‌ఎంసీని మూడు కార్పోరేషన్లు చేయాలనేది రేవంత్ రెడ్డి ఆలోచనగా ఉంది. అయితే గ్రేటర్ ఎన్నికలు ఎప్పుడు పెట్టాలనే దానిపై కూడా సీఎంకు స్పష్టత లేదు. 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది.ఫార్ములా ఈ రేస్, కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో ఏమీ లేదని రేవంత్ కు అర్థమైంది. రేవంత్ పాలనకు పంచాయతీ ఎన్నికల ఫలితాలే నిదర్శనం. కాంగ్రెస్ పాలన దెబ్బకు పరిశ్రమలు ఆంధ్రకు వెళ్ళిపోతున్నాయి. విరూపాక్ష అనే కంపెనీ కర్నూలుకు వెళ్లింది. కాంగ్రెస్ పాలనపై ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. టైమ్ కోసం ఎదురు చూస్తున్నారు. సరైన సమయంలో కాంగ్రెస్ కు, రేవంత్ రెడ్డికి ప్రజలు సరైన తీర్పు ఇస్తారు. ఇక 42శాతం రిజర్వేషన్లు పార్టీ పరంగా ఇవ్వమని చెప్పటానికి రేవంత్ ఎవరు?. మేము పార్లమెంట్ ఎన్నికల్లో 50శాతం, అసెంబ్లీ ఎన్నికల్లో 30శాతం సీట్లు బీసీలకు ఇచ్చాము. ఆయన నుంచి నేర్చుకోవాల్సిన అవసరం మాకు లేదు. మార్కెట్ యార్డ్ లు బీసీలకు ఇచ్చాము. అలానే విద్యా, ఉపాధిలో బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వరు?. అఖిలేష్ యాదవ్ తో ఫ్రెండ్లీగా ఉంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు బాధ ఎందుకు?. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీకి మాత్రమే లోపాయికారి ఒప్పందం ఉంది. తెలంగాణ కాంగ్రెస్ కు ఏటీంగా మారిందని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా స్వయంగా అన్నారు. ఢిల్లీలో బీజేపీ ఎంపీ దుబే గృహప్రవేశానికి తెలంగాణ సీఎం ఎందుకు వెళ్లారో రామచంద్రరావు చెప్పాలి. ఢిల్లీలో రేవంత్ రెడ్డి విందులు, వినోదాలు ఎవరి ఇళ్ళల్లో జరుగుతున్నాయో మాకు తెలుసు. దేశ రాజధాని ఢిల్లీలోని తుగ్లక్ రోడ్ లో రేవంత్ రెడ్డి ఇల్లు రీమోడల్ చేయించిందే బీజేపీ ఎంపీనే. తెలంగాణ సీఎం రేవంత్ .. ఒక కాలు కాంగ్రెస్ లో.. మరొక కాలు బీజేపీలో ఉంచారు. కిషన్ రెడ్డితో మాకు అండర్ స్టాండింగ్ ఉందని అంటున్నారు. కిషన్ రెడ్డి మాకు చేసింది ఏంటో చెప్పాలి' అంటూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు.

# సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్

లోకి రావాలని కోరుతున్నారని మండిపడ్డారు. గ్రామ పంచాయితీలకు రాష్ట్ర ప్రభుత్వం చేసేది ఏం ఉండదన్నారు. గ్రామంలోని ప్రతి అభివృద్ధికి కేంద్ర నిధులే ప్రధానమని స్పష్టం చేశారు. బీజేపీలో గెలిచిన సర్పంచ్‌లకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల మీద అవగాహన ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# పరీక్షలకు వార్షిక జాబ్ క్యాలెండర్ తప్పనిసరి: డిప్యూటీ సీఎం భట్టి..

ప్రణాళికతోనే వారిలో విశ్వాసం పెరుగుతుందని చెప్పుకొచ్చారు. తెలంగాణ పీఎస్సీ విజయవంతంగా జాబ్ క్యాలెండర్ అమలు చేస్తోందని చెప్తూ కమిషన్ ఛైర్మన్, సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం తరఫున అభినందించారు. పారదర్శకతే పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ప్రాణమని.. ప్రశ్నాపత్రాల తయారీ నుంచి తుది ఎంపిక వరకూ ప్రతి దశ స్పష్టంగా ఉండాలన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజ్‌లు ప్రజాసేవ విలువలకు విరుద్ధమని.. వాటిని కట్టడి చేసేందుకు ఆధునిక భద్రతా వ్యవస్థలు, నైతిక శిక్షణ అవసరమని సూచించారు. రిజర్వేషన్లు సంఖ్యలకే కాదని, వాస్తవిక ఫలితాలు ఇవ్వాలంటూ డిప్యూటీ సీఎం భట్టి చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం హాజరయ్యారు.

# గ్రామీణ పేదల హక్కులను కాలరాస్తున్నారన్న సోనియా

రైతులు, వ్యవసాయ కూలీల హక్కులను కాలరా యడమేనని, వారి జీవనోపాధిపై జరుగుతున్న దాడి అని అభివర్ణించారు.ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్' ఖాతాలో ఒక వీడియో సందేశాన్ని పంచుకున్నారు. రెండు రోజుల క్రితం పార్లమెంటులో వీబీ-జీ రామ్ జీ బిల్లు 2025ను ఆమోదించిన నేపథ్యంలో సోనియా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.దాదాపు రెండు దశాబ్దాల క్రితం మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ హయాంలో ఈ చట్టాన్ని తీసుకొచ్చిన విషయాన్ని సోనియా గుర్తుచేశారు. ఇది కోట్లాది గ్రామీణ కుటుంబాలకు, ముఖ్యంగా అణగారిన వర్గాలకు జీవనోపాధి భద్రత కల్పించిన ఒక విప్లవాత్మక అడుగు అని ఆమె పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ఈ పథకం పేదలకు జీవనాధారంగా నిలిచిందని తెలిపారు.అయితే, గత 11 ఏళ్లుగా మోదీ ప్రభుత్వం ఈ పథకాన్ని నీరుగార్చేందుకు అనేక ప్రయత్నాలు చేసిందని సోనియా ఆరోపించారు. ప్రతిపక్షాలతో సంప్రదింపులు జరపకుండా, ఏకపక్షంగా ఉపాధి హామీ పథకం స్వరూపాన్నే మార్చేశారని, చివరకు మహాత్మా గాంధీ పేరును కూడా తొలగించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికి, ఎక్కడ, ఎంత పని ఇవ్వాలనే నిర్ణయాలను క్షేత్రస్థాయి వాస్తవాలకు దూరంగా ఢిల్లీ నుంచి తీసుకుంటున్నారని విమర్శించారు.20 ఏళ్ల క్రితం ఈ చట్టం కోసం నేను పోరాడాను. ఇప్పుడు ఈ నల్ల చట్టానికి వ్యతిరేకంగా పోరాడేందుకు కూడా నేను కట్టుబడి ఉన్నాను అని సోనియా ఉద్ఘాటించారు. ఈ పోరాటంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

# ఉపాధి హామీ చట్టాన్ని స్కీమ్ గా మార్చడం దుర్మార్గం

- జి రాంజీ ఉపాధి బిల్లును ఉపసంహరించుకోవాలి
- లక్షలాది మంది ఉపాధికి దూరమయ్యే ప్రమాదం
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగారపు రమేష్

**దేవరుప్పుల (నమస్తే హైదరాబాద్):** దేవరుప్పుల మండలం నిర్మల బంజర రామరాజు పల్లి సింగరాజుపల్లి కామారెడ్డి గూడెంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, ఉపాధి కరువై గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.పేదలు, వ్యవసాయ కార్మికులు, దళితులు, వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం పై పోరాడి 2005లో ఈ చట్టాన్ని సాధించుకున్నారని గుర్తు చేశారు.ఉపాధి హామీ చట్టాం కోట్లాదిమంది జీవన ప్రమాణాలు పెంచేందుకు ఎంతగానో దోహదం చేసిందని అన్నారు.ఈ చట్టాన్ని విస్తరించి పట్టణాల్లో అమలు చేయాల్సిన అవసరం ఉండగా గ్రామాల్లోనూ తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు,ప్రభుత్వాల దయ దక్షిణాలపై ఆధారపడి ఉపాధి పనులు చూపాలని ఉద్దేశంతో పథకంలో మార్పులు చేయడం కేంద్ర ప్రభుత్వం భూస్వామ్య మనువాద భావాజాలానికి నిదర్శనమని వారు ఆరోపించారు,ఇప్పటివరకు 100% నిధులు ఇస్తున్న కేంద్రం 60 శాతం ఇస్తామని మిగిలిన 40 శాతం రాష్ట్రాలు భరించేలా అమలు చేయడం చట్టం లక్ష్యాన్ని కాలరాయడమని అన్నారు జాబ్ కార్డుల హేతు బద్ధీకరణ పేరుతో ప్రస్తుతం ఉపాధి పొందుతున్న కోట్లాదిమంది కార్డులను తొలగించేయాల కొత్త నిబంధన చేర్చిందని వ్యవసాయ పనులు జరిగే 60 రోజులు ఉపాధి నిలిపివేయాలి అనుకోవడం కేవలం భూస్వాములు ధనిక రైతులపై ఆధారపడేలా చేసేందుకేనని అభ్యంతరం వ్యక్తం చేశారు.నూతన ఉపాధి పథకాన్ని వ్యతిరేకించాలని ఉపాధికి గ్యారెంటీ ఇచ్చే పాత చట్టాన్ని అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాలు పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గడ్డం యాదగిరి, శ్రీను, లాల్ తదితరులు పాల్గొన్నారు.




# ఎల్బీ స్టేడియంలో క్రిస్మస్ వేడుకలు.. సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు



**నమస్తే హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ ఎల్బీ స్టేడియంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని క్రిస్టియన్ సోదరులకు ప్రభుత్వం తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు బోధనలను స్మరించుకుంటూ మానవ సేవయే మాధవ సేవగా భావించి ప్రేమను పంచాలని, ద్వేషించే వారిని కూడా ప్రేమించాలని ఆయన పిలుపునిచ్చారు.డిసెంబర్ నెలను 'మిరాకిల్ మంత్'గా అభివర్ణించిన రేవంత్, ఇది క్రీస్తు ఆరాధకులకు మాత్రమే కాకుండా తెలంగాణ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి కూడా మిరాకిల్ మంత్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ పుట్టినరోజు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు డిసెంబర్‌లోనే జరిగాయని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏసుక్రీస్తు బోధనల స్ఫూర్తితో పనిచేస్తోందని చెప్పిన సీఎం, దుష్ప్రచారాలు, ఇబ్బందులు ఎదురైనా శాంతిని కాపాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు.ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 3.10 కోట్ల మందికి సన్న బియ్యం, రుణమాఫీతో పాటు రైతులకు 500 బోనస్ వంటి పథకాలను సీఎం ఉదహరించారు. క్రిస్టియన్ మిషనరీలు విద్య, వైద్య రంగాల్లో చేసిన సేవలను కొనియాడిన రేవంత్, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తామని స్పష్టం చేశారు. క్రిస్టియన్-ముస్లిం స్మశానవాటికల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ ప్రకారం అభివృద్ధి, సంక్షేమంలో దేశంలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. వేడుకల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, క్రిస్టియన్ నేతలు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో దూసుకుపోతున్న చిల్కానగర్ డివిజన్

## కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్





**ఉప్పల్, డిసెంబర్ 20 (నమస్తే హైదరాబాద్):** చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి బ్యాంక్ కాలనీ నుండి సాయిరాం నగర్ కాలనీ వరకు నాలుగు ఫీట్ల వెడల్పుతో నిర్మిస్తున్న బాక్స్ డ్రైన్ పనులను పర్యవేక్షించారు.అనంతరం వారు అధికారులతో మాట్లాడుతూ బాక్స్ నిర్మాణ సమయంలో కాలనీ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్ణయిత సమయంలో పని పూర్తి చేసే విధంగా, నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించే విధంగా డిఇ మరియు ఏఈ లు పర్యవేక్షణలో పనులు సాగాలని నాణ్యత ప్రమాణాలు కాంట్రాక్టర్ పాటించిన యెడల కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీ.ఈ. వెన్నెల గౌడ్, ఏ.ఈ. రాధిక వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎదుల్ల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, బాలకృష్ణ గౌడ్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, బంటి గౌడ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటరెడ్డి నగర్ ప్రాథమిక పాఠశాలలో శ్రమదానం, కార్పెంటర్ పనులు చేసిన ఫెవికాల్ ఛాంపియన్ క్లబ్ ప్రతినిధులు





**ఉప్పల్, డిసెంబర్ 20 ( నమస్తే హైదరాబాద్):** శ్రమదాన దివస్ సందర్భంగా వెంకట్ రెడ్డి నగర్ ఫెవికాల్ ఛాంపియన్ క్లబ్ అధ్యక్షుడు చెల్లోజు ఎల్లాచారి ఆధ్వర్యంలో వెంకట్ రెడ్డినగర్ స్థానిక ప్రాథమిక పాఠశాలలో క్లబ్ సభ్యులు శ్రమదానం, కార్పెంటర్ పనులు చేశారు. పాఠశాలలోని కిటికీలు, తలుపులు, చిన్న చిన్న మరమతులు ఉచితంగా చేశారు. ఈకార్యక్రమంలో విశ్వనాధుల రామకృష్ణ చారి,అనంతోజు శ్రీనివాస్ చారి, కేతోజు రాఘవులు చారి ,సతీష్ చారి ,కేతోజు కృష్ణ చారి, బ్రహ్మచారి ,వెంకటేష్ చారి,గన్నోజు బాలాచారి,ఫెవికాల్ ఇన్చార్జి కంపెనీ ప్రతినిధి విద్యాసాగర్, మహేష్ , తదితరులు పాల్గొన్నారు.

# గుర్రపు డెక్క పూర్తిగా తొలగించే వరకు బిల్లులు చెల్లించవద్దు..

## నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్





**ఉప్పల్, డిసెంబర్ 20 ( నమస్తే హైదరాబాద్):** నాచారంలోని హెచ్ఎంటి నగర్ మరియు ఇందిరానగర్లలో గత కొన్ని రోజులుగా దోమల సమస్య రోజురోజుకు తీవ్రతరం అవుతూ ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. దీనికి ప్రధాన కారణం హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువులో విపరీతంగా వచ్చి చేరిన గుర్రపు డెక్క. హెచ్ఎంటి పెద్ద చెరువులో గుర్రపు డెక్క తొలగింపు కొరకు సంవత్సరం గుర్రపు డెక్క తొలగింపు మెయింటెనెన్స్ దక్కిన కాంట్రాక్టర్ చెరువులో గుర్రపు డెక్క ఒకసారి పూర్తిగా తొలగించి సుమారు నాలుగు ఐదు నెలల క్రితం ఎఫ్ టి సి యంత్రాన్ని హెచ్ఎంటి చెరువు నుంచి వేరే చెరువుకు తరలించడం జరిగింది.అప్పటినుండి చెరువులో గుర్రపు డెక్కన్ తొలగించి మెయింటెనెన్స్ చేసే నాథుడే కరువయ్యారు. ఇదే విషయమై ఎంటమాలజీ ఎస్. ఈ. మాధవరెడ్డి ని హెచ్ఎంటి చెరువు వద్దకు శనివారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ పర్యవేక్షించాలని కోరారు.గుర్రపు డెక్క తొలగింపు కాంట్రాక్టు ను ఇంజనీరింగ్ అధికారులు చూస్తున్నారని తెలియజేశారు.

చెరువులోని గుర్రపు డెక్క పూర్తిగా తొలగించే వరకు కాంట్రాక్టర్ కు బిల్లులు చెల్లించవద్దని ఎల్బీనగర్ ఇంజనీరింగ్ ఎస్ ఈ. అశోక్ రెడ్డి కి ఫోన్లో కార్పొరేటర్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సాయి జన శేఖర్, విట్టల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, మోహన్ రెడ్డి, ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, మక్బూల్, నర్సింగ్ రావు, వాసు, వీరాంజనేయులు, రవీందర్ రెడ్డి, రామరాజు, బాల్ రెడ్డి, సుభాస్కర్, యాదగిరి రెడ్డి, చంద్రశేఖర్, కొండయ్య, ఎంటమాలజీ సూపర్వైజర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుదారులు వాటి కోసం క్యూలో ఉండాల్సిన అవసరమే లేదు

**నమస్తే హైదరాబాద్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజల కోసం డిజిటల్ సేవలను మరింత చేరువ చేస్తోంది. ఇందులో భాగంగా రేషన్ కార్డు దారుల సౌకర్యార్థం టీ-రేషన్ యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చింది. గతంలో రేషన్ కార్డులో పేరు ఉందో లేదో తెలుసుకోవాలన్నా.. ప్రతి నెల ఎంత బియ్యం వస్తున్నాయో చూడాలన్నా రేషన్ షాపుల చుట్టూ లేదా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఆ అవసరం లేకుండా... మీ మొబైల్ ఫోన్ ద్వారానే సమస్త సమాచారాన్ని నిమిషాల్లో తెలుసుకోవచ్చు. టీ-రేషన్ యాప్ అంటే ఏమిటి..? తెలంగాణ పౌర సరఫరాల శాఖ రూపొందించిన ఈ యాప్, రేషన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంచడానికి ఒక గొప్ప ప్రయత్నం. దీని ద్వారా సామాన్య ప్రజలకు తమకు అందే సరుకులపై పూర్తి అవగాహన కలుగుతుంది. రేషన్ డీలర్లు ఇచ్చే సమాచారంతో సంబంధం లేకుండా.. ప్రభుత్వం మీకు ఎంత కేటాయించిందో నేరుగా చూసుకోవచ్చు. ఈ యాప్ కేవలం సమాచారం చూడటానికే కాకుండా.. అనేక రకాల సేవలను అందిస్తుంది. అందులో .. బియ్యం కోటా వివరాలు కూడా ఉంటాయి. ప్రతి నెలా మీ కుటుంబానికి ఎన్ని కిలోల బియ్యం, గోధుమలు లేదా ఇతర సరుకులు వస్తాయో ముందుగానే తెలుసుకోవచ్చు. గత ఆరు నెలల్లో మీరు ఏ తేదీన.. ఎంత రేషన్ తీసుకున్నారో పూర్తి జాబితా కనిపిస్తుంది. రేషన్ కార్డులో ఎంతమంది పేర్లు ఉన్నాయి..? ఎవరి ఆధార్ కార్డు లింక్ అయ్యింది అనే వివరాలు కూడా ఉంటాయి. మీకు కేటాయించిన రేషన్ షాప్ నంబర్, డీలర్ పేరు, ఆ షాప్ ఎక్కడ ఉందో మ్యాప్ ద్వారా కూడా తెలుసుకోవచ్చు. రేషన్ వ్యవస్థలో అవినీతిని అరికట్టడానికి ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. చాలా సందర్భాలలో కొంతమంది డీలర్లు సరుకులు తక్కువగా ఇస్తున్నారనే ఫిర్యాదులు వస్తుంటాయి. కానీ ఈ యాప్ వాడటం వల్ల ప్రభుత్వం ఆ నెలలో మీకు కేటాయించిన అసలు పరిమాణం ఎంతో మొబైల్లో కనిపిస్తుంది. దీనివల్ల డీలర్లను ప్రశ్నించే అవకాశం ప్రజలకు కలుగుతుంది. గంటల తరబడి రేషన్ షాపుల వద్ద క్యూలో నిలబడి వివరాలు అడగాల్సిన పనిలేదు. ఈ యాప్ తెలుగు , ఇంగ్లీష్ భాషల్లో ఉండటం వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా సులభంగా వాడుకోవచ్చు. మీ రేషన్ కార్డు యాక్టివ్గా ఉందో లేదో ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవచ్చు. ప్రతి విషయానికి రేషన్ షాపుకు వెళ్లి.. డీలర్లను అడగాల్సిన అవసరం లేకుండా.. ఈ రేషన్ యాప్లోనే అన్నీ తెలుసుకునే విధంగా ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ యాప్ను వాడటం చాలా సులభం. ముందుగా ప్లే స్టోర్ నుండి అని సెర్చ్ చేసి డౌన్లోడ్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేయగానే మీ రేషన్ కార్డు నంబర్ లేదా ఆధార్ నంబర్ అడుగుతుంది. వివరాలు నమోదు చేయగానే మీ కార్డుకు సంబంధించిన పూర్తి డాష్బోర్డ్ కనిపిస్తుంది. అక్కడ 'స్టాక్ రిపోర్ట్' లేదా 'అలోకేషన్' అనే ఆప్షన్ల ద్వారా మీ నెలవారీ సరుకుల వివరాలు చూడవచ్చు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఈ డిజిటల్ విప్లవం వల్ల సామాన్యులకు రేషన్ సేవలు మరింత పారదర్శకంగా, వేగంగా అందుతున్నాయి.

# సరైన ఆలోచనతో వ్యర్థాలను విలువైన వనరులుగా మారుద్దాం..

**చిత్తశుద్ధితో పనిచేసి స్వచ్ఛ సర్వేక్షణలో అగ్రగామిగా నిలుద్దాం..**

**-స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**నమస్తే హైదరాబాద్ :** వ్యర్థాలను సరైన ఆలోచన మరియు కార్యాచరణతో విలువైన వనరులుగా మార్చడం ద్వారా సర్క్యులర్ ఎకానమీతో ఆర్థికంగా, సామాజికంగా, పర్యావరణం పరంగా బహుముఖ ప్రయోజనాలు ఉంటాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

డిసెంబర్ నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా నందిగామ మునిసిపాలిటీ పరిధిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్థానిక ప్రజాప్రతినిధులు, సమన్వయ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. మొక్కలు నాటిన అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వివిధ కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేసే ఉద్దేశంతో ప్రతినెలా మూడో శనివారం ప్రత్యేక థీమ్తో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల పర్యావరణంలో అవకాశాలు-సర్క్యులర్ ఎకానమీ ఇతివృత్తంతో కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. వ్యర్థాలను సరైన విధంగా నిర్వహించడం ద్వారా సర్క్యులర్ ఎకానమీకి బాటలు వేయొచ్చని.. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల ద్వారా వస్తున్న ఫలితాలు ఇందుకు ఉదాహరణలు అని తెలిపారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర ఏ 2047 సాకారానికి ముందడుగుగా ప్రతిఒక్కరూ స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్రకు కృషిచేయాల్సిన అవసరముందని.. ప్రకృతి వ్యవసాయం, జల వనరుల సంరక్షణ, పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వడం, ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి దూరంగా ఉండటం తదితరాల వల్ల భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని బహుమతిగా అందించేందుకు వీలవుతుందన్నారు. 33 శాతం హరిత విస్తీర్ణం ఉండాలని, అయితే జిల్లాలో ఇది 25 శాతం ఉండాలని, ఇందుకోసం గ్రామాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకెళు న్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.


స్వచ్ఛ సర్వేక్షణ అవార్డులకు కృషిచేయాలి:పారిశుద్ధ్యం, హరిత విస్తీర్ణం పెంపు, ప్రజల భాగస్వామ్యం, శుద్ధ ఇంధన వినియోగం, పరిశుభ్రమైన రహదారులు ఇలా వివిధ అంశాల్లో మెరుగైన ప్రగతి ద్వారా స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల సాధనకు కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ప్రకృతిని, పర్యావరణాన్ని సరైన విధంగా అర్థం చేసుకొని ముందడుగు వేయాలని.. వినూత్న ఆలోచనల ద్వారా పరిసరాలు, నివాసాల ద్వారా ఉత్పన్నమయ్యే వ్యర్థాలను వనరులుగా ఉపయోగించుకుంటూ స్వయం ఉపాధి, వాణిజ్య అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని వివరించారు. తడిచెత్త, పొడిచెత్తను వేరుచేసి ఇవ్వడం వల్ల, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి సేద్యాన్ని అనుసరిస్తే కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులను కలెక్టర్ లక్ష్మీశ.. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సత్కరించారు. ప్లాస్టిక్ భూతంపై చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకోగా.. చిన్నారులను కలెక్టర్ లక్ష్మీశ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, మునిసిపల్ ఛైర్పర్సన్ మండవ కృష్ణకుమారి, మునిసిపల్ కమిషనర్ లోవరాజు, మెప్మా పీడీ మురళి, ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం, స్థానిక ప్రజలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్న సమయంలో 7 ఉప ఎన్నికల్లో ఓడిపోయారని వ్యాఖ్య

**నమస్తే హైదరాబాద్):** రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి హనీమూన్ ముగిసిందని ఇక కేసీఆర్ ప్రజల్లోకి వస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ రేపు అన్ని విషయాలపై పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. కేసీఆర్ బహిరంగ సమావేశాలపై రేపటి సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎవరితో ఫుట్‌బాల్ ఆడుకుంటారో తనకు తెలియదని, కానీ తాను మాత్రం ఆయనతో ఫుట్‌బాల్ ఆడుకుంటానని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తనను ఫెయిల్యూర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడంపై కూడా కేటీఆర్ స్పందించారు. తాను ఫెయిల్యూర్ నాయకుడిని కాదని ఆయన అన్నారు. తాను వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక 32 జిల్లా పరిషత్‌లు, 136 మున్సిపాలిటీలను గెలిచామని గుర్తు చేశారు.అయితే రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 7 ఉప ఎన్నికలు నిర్వహిస్తే అన్ని స్థానాల్లో ఓడిపోయారని కేటీఆర్ గుర్తు చేశారు. ఆయన ముఖ్యమంత్రి అయ్యాక సొంత పార్లమెంటు స్థానాన్ని కూడా గెలిపించలేకపోయారని విమర్శించారు. తాను ఐరన్ లెగ్ కాదని, రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలే ఐరన్ లెగ్‌లు అని ఆయన అన్నారు. ఢిల్లీలో రేవంత్ రెడ్డి విందులు, వినోదాలు ఎవరి ఇళ్లల్లో జరుగుతున్నాయో అందరికీ తెలుసని కేటీఆర్ వ్యాఖ్యానించారు.ఢిల్లీలోని తుగ్లక్ రోడ్డులో రేవంత్ రెడ్డి ఇల్లును రీమోడల్ చేయించిందే బీజేపీ ఎంపీ అని ఆయన ఆరోపించారు. సీఎం రమేశ్‌కు కాంట్రాక్టులు ఇస్తుంది రేవంత్ రెడ్డేనని అన్నారు. తాను ముఖ్యమంత్రి ఇంట్లోని మహిళలు, పిల్లలు, మనవడి గురించి మాట్లాడనని కేటీఆర్ స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి వలె తాను కుటుంబ సభ్యుల గురించి మాట్లాడి చిల్లర రాజకీయాలు చేయదలుచుకోలేదని ఆయన అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు.



# అస్సాం అభివృద్ధిలో కొత్త అధ్యాయం.



**నమస్తే హైదరాబాద్ :** బెంగాల్ పర్యటన తర్వాత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన కోసం శనివారం (డిసెంబర్ 20) అస్సాం చేరుకున్నారు. ఈ పర్యటన సందర్భంగా, గోపీనాథ్ బోర్డోలోయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. వెదురు తోట ప్రకృతి ఇతివృత్తంతో రూపొందించిన మొదటి టెర్మినల్ ఇది. అలాగే, ఆదివారం (డిసెంబర్ 21), ప్రధాని మోదీ అస్సాంలో రూ.15,600 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభిస్తారు."ఈ రోజు ఒక విధంగా అభివృద్ధిని జరుపుకునే రోజు. ఇది అస్సాంకే కాదు, మొత్తం ఈశాన్యానికి అభివృద్ధిని జరుపుకునే రోజు. కాబట్టి, మీ మొబైల్ ఫోన్‌లను తీసి, ఫ్లాష్‌లైట్‌లను వెలిగించి, ఈ అభివృద్ధి వేడుకలో పాల్గొనమని కోరుతున్నాను. ప్రతి మొబైల్ ఫోన్ వెలిగించాలి. ప్రతిధ్వనించే చప్పట్ల ద్వారా, అస్సాం అభివృద్ధిని జరుపుకుంటుందని దేశం మొత్తం చూస్తుంది. అభివృద్ధి వెలుగు చేరుకున్నప్పుడు, కొత్త జీవిత మార్గాలు ఎగరడం ప్రారంభిస్తాయి'' అని ప్రధానమంత్రి మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు.బహిరంగ సభలో ప్రసంగిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , "అస్సాం భూమి పట్ల నాకున్న అనుబంధం, అక్కడి ప్రజల ప్రేమ, ఆప్యాయత, ముఖ్యంగా అస్సాం, ఈశాన్య ప్రాంతాలకు చెందిన తల్లులు, సోదరీమణుల ప్రేమ నాకు నిరంతరం స్ఫూర్తినిస్తాయి. ఈశాన్య ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే మా సంకల్పాన్ని బలోపేతం చేస్తాయి. నేడు, మరోసారి, అస్సాం అభివృద్ధికి కొత్త అధ్యాయం మొదలవుతోంది" అని ప్రధాని మోదీ అన్నారు. "అస్సాంలో బ్రహ్మపుత్ర నది ప్రవహించడం ఎప్పటికీ ఆగనట్లే, బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కింద అభివృద్ధి ప్రవాహం నిరంతరాయంగా ప్రవహిస్తోంది. ఇక్కడ ప్రసిద్ధి చెందిన గోపీనాథ్ బోర్డోలోయ్ విమానాశ్రయం కొత్త టెర్మినల్ ప్రారంభోత్సవం మన సంకల్పానికి నిదర్శనం. ఈ కొత్త టెర్మినల్ భవనం కోసం అస్సాం ప్రజలందరికీ, దేశ ప్రజలకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను" అని ఆయన అన్నారు. "ఈ కొత్త టెర్మినల్ భవనం గౌహతి సామర్థ్యాన్ని పెంచుతుంది. 125 మిలియన్లకు పైగా పర్యాటకులు రాగలరు. ఇక నుంచి దేశప్రజలకు కామాఖ్య అమ్మవారిని సందర్శించడం సులభం అవుతుంది. ఈ విమానాశ్రయం అభివృద్ధి, వారసత్వాన్ని ప్రదర్శిస్తుంది. పచ్చదనంతో నిండిన టెర్మినల్ డిజైన్ ప్రకృతిలో పాతుకుపోయింది. ఇది సాంకేతికత. దాని నిర్మాణంలో వెదురును ఉపయోగించారు. ఇది దాని అందం, బలాన్ని చూపిస్తుంది. మీరు 2014లో నాకు పని ఇచ్చారు. దీనికి ముందు, దేశంలో వెదురును కోయకూడదని ఒక చట్టం ఉంది. వెదురును చెట్టు అని చెప్పేవారు, అయితే ప్రపంచం వెదురును ఒక మొక్క అని నమ్ముతుంది. మేము చట్టాన్ని తొలగించాము. ఇది నిజంగా వెదురు గుర్తింపు. అప్పుడే ఇంత పెద్ద భవనం వెదురుతో నిర్మించారు. నేడు, భారతీయ విమానాశ్రయాల రూపకల్పన ప్రపంచవ్యాప్తంగా చర్చించబడుతోంది." అని ప్రధానమంత్రి మోదీ స్పష్టం చేశారు.

# సౌదీ బస్సు ప్రమాద బాధితులకు ఊరట.. పరిహారం విడుదల చేసిన ప్రభుత్వం



సౌదీ అరేబియాలో గత నెలలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన 45 మంది సజీవదహనమైన సంగతి తెలిసిందే. వీరిలో హైదరాబాద్, విద్యానగర్ ప్రాంతానికి చెందిన నజీరుద్దీన్ వ్యక్తి కుటుంబంలో మరింత విషాదం చోటు చేసుకుంది. నజీరుద్దీన్ కుటుంబంలోని రెండేళ్ల నుంచి 12 ఏళ్ల లోపు చిన్నారులంతా ఈ బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో మరణించిన హైదరాబాద్ వాసుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 3.07 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు మైనారిటీ సంక్షేమ శాఖ నుంచి జీవో నం.125 ద్వారా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మొత్తాన్ని తెలంగాణ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఖాతాలో జమ చేయాలని సీఎంవో అధికారులు ఆదేశించారు. నవంబర్ 17న జరిగిన ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన 45 మంది ప్రాణాలు కోల్పోగా, ఒక వ్యక్తి తీవ్ర గాయాలతో బయటపడ్డారు.ఈ దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 3.07 కోట్లు విడుదలయ్యాయి. మైనారిటీ సంక్షేమ శాఖ ఈ నిధుల మంజూరుకు జీవో నం.125 జారీ చేసింది. ఈ డబ్బును తెలంగాణ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఖాతాలో జమ చేయాలని సీఎంవో అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఖాతా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఫతే మైదాన్ బ్రాంచ్‌లో ఉంది.నవంబర్ 17న సౌదీ అరేబియాలో జరిగిన బస్సు ప్రమాదం చాలా విషాదకరం. ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన 45 మంది దుర్మరణం పాలయ్యారు. ఒక వ్యక్తి మాత్రం తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాదం తర్వాత ఆయన అక్కడే కొద్ది రోజులు చికిత్స పొంది, ఇటీవల హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు.హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన 54 మంది ఉమ్రా యాత్రకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దీనిలో భాగంగా వారంతా.. నవంబర్ 9న హైదరాబాద్ నుంచి బయలుదేరి, వివిధ ప్రాంతాలను సందర్శించి, నవంబర్ 23న తిరిగి రావాలని ప్రణాళిక వేసుకున్నారు. ఈ యాత్రలో భాగంగా 54 మంది యాత్రికులు నవంబర్ 9న హైదరాబాద్ నుంచి జెడ్డాకు బయలుదేరారు. ఆ తర్వాత మక్కా చేరుకుని, అక్కడితో పాటు సమీపంలోని పవిత్ర స్థలాలను సందర్శించారు.మక్కా యాత్రను ముగించుకున్న తర్వాత, 46 మంది యాత్రికులు బస్సులో మదీనాకు బయలుదేరారు. అయితే, మొత్తం 54 మందిలో 46 మంది బస్సులో ప్రయాణించగా, మరో నలుగురు కారులో మదీనాకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. మిగిలిన నలుగురు వ్యక్తిగత కారణాల వల్ల మక్కాలోనే ఉండిపోయారు. అయితే ఈ 46 మంది ప్రయాణిస్తున్న బస్సులో మంటలు చెలరేగి దానిలోనే సజీవదహనం అయ్యారు. కేవలం ఒక్క వ్యక్తి మాత్రమే ప్రాణాలతో బయటపడ్డాడు.

# మల్లాపూర్ లో అయ్యప్ప పూజలో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్, డిసెంబర్ 20 ( నమస్తే హైదరాబాద్):** ఈరోజు మల్లాపూర్ డివిజన్ కె. ఎల్.రెడ్డి నగర్ కమ్యూనిటీ హాల్లో అరుణోదయ కలసాంస్కృతిక వేదిక వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 16వ అయ్యప్ప పడి పూజా మహోత్సవానికి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు,ఈ కార్యక్రమంలో అరుణోదయ కళా సాంస్కృతిక వేదిక అధ్యక్షులు సి.రాధాకృష్ణన్ ,కార్యదర్శి సునీష్ జాకోబ్ ,కోశాధికారి ఎం.బిజూ కుమార్ ,మాణి, వెంకట్ , కేఎల్ రెడ్డి నగర్ అసోసియేషన్ సభ్యులు,సీనియర్ నాయకులు వి. ఎస్.ప్రకాష్ రెడ్డి,మల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు కప్పర సాయి గౌడ్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్, ఎస్ వి. కిట్టు,దంతూరి రాజు గౌడ్,కోయగూర బాలరాజ్,శ్రీనివాస్,కె.రాజేష్,రుపేందర్ రెడ్డి,కె.సురేష్,ఎం.జయంత్ గౌడ్,వంగవీటి ప్రిన్స్,వినీష్ యాదవ్,స్థానికులు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రామంతపూర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు తో కలిసి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్, డిసెంబర్ 20 ( నమస్తే హైదరాబాద్):** రామంతపూర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని డివిజన్ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు తెలిపారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ , ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. శనివారం రామంతపూర్ డివిజన్‌లోని ఇందిరా నగర్ కాలనీలో రూ.57 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్డు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు తో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామంతపూర్ డివిజన్ అభివృద్ధికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీ.ఈ. నాగమణి, ఏ.ఈ. మౌనిక, కాలనీ వాసులు కొమిరిశెట్టి హరి, ఏర్వ బాలరాజ్, చక్రపాణి, అంజిరెడ్డి, చిలకమర్రి నర్సింగరావు, చంద్రయ్య, పూస సత్తయ్య, బిక్షపతి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# బస్తీ బాటతో మల్లాపూర్ లోని మంచి నీటి సమస్యకు కృషి : నెమలి అనిల్ కుమార్






**ఉప్పల్ డిసెంబర్ 20 ( నమస్తే హైదరాబాద్):** "బస్తీ బాట" కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ లో ప్రజలు ఎదుర్కుంటున్న మంచి నీటి సమస్య పరిష్కారం కోసం గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ శనివారం మల్లాపూర్ జలమండలి ఏ.ఈ సిరాజ్ తో కలిసి కె. ఎల్.రెడ్డి నగర్ కాలనీ,భవాని నగర్ కాలనీ, హెచ్ సి ఎల్ కాలనీలలో పర్యటించడం జరిగింది.నీటి సమస్య పరిష్కారం కోసం తగిన చర్యలు చేపట్టి అతి త్వరలో పరిష్కరించే విధంగా ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేయాలని ఈ సందర్భంగా ఏ.ఈ ని నెమలి అనిల్ కుమార్ కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోయలకొండ రాజేష్ ,సంయుక్త కార్యదర్శి వుండం శ్రీనివాస్ ,కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు,లైన్ మెన్లు,తదితరులు పాల్గొన్నారు.

# గుణదల లో ఘనంగా జిల్లా సీనియర్ షూటింగ్ బాల్ జట్ల ఎంపికలు

**నమస్తే హైదరాబాద్ :** కృష్ణాజిల్లా షూటింగ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో విజయవాడ అర్బన్ గుణదల లోని టీ గిఫ్ క్రీడా మైదానంలో సీనియర్ పురుషుల మహిళల జిల్లా షూటింగ్ బాల్ జట్ల ఎంపికలు ఘనంగా నిర్వహించినట్లు కృష్ణాజిల్లా షూటింగ్ బాల్ సంఘ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ షూటింగ్ బాల్ క్రీడాకారుడు గోగులమూడి విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ జిల్లాలో షూటింగ్ బాల్ క్రీడకు ఆదరణ పెరిగిందని, జిల్లాలోని అధిక పాఠశాలలో క్రీడాకారులు షూటింగ్ బాల్ క్రీడను అభ్యసిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా నలుమూల నుండి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు ఈ ఎంపికలకు హాజరయ్యారని అన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు నెల్లూరు జిల్లాలోని కావలిలో జరగబోయే ఎనిమిదవ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల మహిళల షూటింగ్ బాల్ పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని అన్నారు.



# బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ లకు సన్మానం చేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికార మదంతో పోలీసుల బలంతో ఎన్నో ఇబ్బందులు
ఎన్నో ప్రలోభాలకు గురి చేసినా తట్టుకొని నిలబడి విజయం సాధించిన బి ఆర్ఎస్ పార్టీ సర్పంచ్ లు






**దేవరుప్పుల (నమస్తే హైదరాబాద్):** దేవరుప్పుల మండల కేంద్రంలోని అక్షర గార్డెన్ లోజిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పల్ల సుందర్ రాంరెడ్డి నాయకత్వంలో దేవర్పుల మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలలో గెలిచిన బి ఆర్ ఎస్ పార్టీ సర్పంచ్ లకు శనివారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.
మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ముఖ్యఅతిథిగా విచ్చేసి
బిఆర్ఎస్ పార్టీ విజయం సాధించిన నూతన సర్పంచులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు .ఈ సందర్భంగా
ఎమ్మెల్యే ఎన్నికలలో దేవరుప్పుల మండలంలో 61% శాతం ఓట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ
సర్పంచ్ ఎన్నికలలో 30% శాతానికి పడిపోవడానికి దేనికి నిదర్శనం, ఎమ్మెల్యే ఎన్నికలలో 31 శాతం ఉన్న బిఆర్ఎస్ పార్టీ
సర్పంచ్ ఎన్నికల్లో 60% శాతం ఓట్లు సాధించి పూర్వవైభవం ప్రదర్శించి, కాంగ్రెస్ పార్టీ నాయకత్వం యొక్క అహంకారానికి అడ్డుకట్ట వేస్తూ దూసుకెళ్తుందనీ అన్నారు.చిన్న చిన్న ఓటు బ్యాంక్ ఉన్న గ్రామాలను బెదిరించి బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను వాళ్ళ పార్టీ లో చేర్పించికొని గెలిచాం అని చెప్పుకుంటున్నారు. మేజర్ గ్రామాలన్నీ బిఆర్ఎస్ వైపే ఉన్నాయని ఈ ఎలక్షన్లు నిరూపించాయి.ప్రజల పక్షాన ఎప్పటికప్పుడు పోరాటం చేస్తూ బిఆర్ఎస్ మంచి ఆదరణ పొంది రాబోయే ఎంపీటీసీ,జెడ్పిటిసి ఎన్నికలలో ముందంజలో ఉండటం ఖాయం అని అన్నారు. అధికారాన్ని పోలీసులను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఎన్నికలకు తెలంగాణ ప్రజలు ఓటుతోనే గట్టి గుణపాఠం చెప్పారనీడబ్బుసంచులతో ప్రలోభపెట్టాలని చూసిన బెదిరింపులకు పాల్పడినా ప్రజలు మాత్రం గులాబీ జెండా వైపే నిలిచారనీ నామినేషన్ల దశ నుంచే మన అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేశారనీ ఏకగ్రీవాల పేరుతో బెదిరించారని అయినా సరే మన కార్యకర్తలు, నాయకులు గులాబీ జెండాను వదలలేదు. ఈ గెలుపు బీఆర్ఎస్ కార్యకర్తల మనోధైర్యానికి నిదర్శనం అనితెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారని ఈ ఫలితాలుస్పష్టంచేశాయి.
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదు. పైగా కేసీఆర్ ఇస్తున్న పథకాలకు కోతలు పెట్టారు.
ఈ మోసాన్ని ప్రజలందరూ గమనించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కు బుద్ధి చెప్పారు. ప్రజలు కేసీఆర్ నాయకత్వం కోసం బీఆర్ఎస్ పాలన కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు మెజారిటీ స్థానాల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులే గెలిచారు. ప్రభుత్వం సహకరించకపోయినా.. మీరు ధైర్యంగా ఉండండి. మీ వెనుక పార్టీ ఉంది కేసీఆర్ గారు, నేను ఉన్నాము . ప్రజల పక్షాన నిలబడి కొట్లాడి నిధులు సాధించుకుందాం. మీరంతా మీ గ్రామాల అభివృద్ధి కోసం నిబంధనతో పని చేయండి అని నూతన బిఆర్ఎస్ పార్టీ సర్పంచులకు ఉప సర్పంచులకు వార్డ్ మెంబర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, పిఎసిఎస్ డైరెక్టర్ కొత్త జలంధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మలిపెద్ది శ్రీనివాస్ రెడ్డి, కోతి ప్రవీణ్, మాజీ ఎంపీపీ కొల్లూరు సోమయ్య, మాజీ ఏఎంసీ డైరెక్టర్ కుతాటి నరసింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్ సింగ్,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, గ్రామ కార్యదర్శులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

# ప్రజలతో మమేకం కండి

పార్టీ నేతలకు టీడీపీ అధినేత,
ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు
అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
బీజేపీ, జనసేన నాయకులతో సమన్వయంతో ముందుకువెళ్లాలి



**నమస్తే హైదరాబాద్ :** అనకాపల్లి, డిసెంబరు 20 పార్టీ కార్యకర్తల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉ ందని టీడీపీ అధినేత, సీఎం నారా చంద్రబాబునాయుడు అన్నారు. శనివారం అనకాపల్లి జిల్లా తాళ్లపాలెం పంచాయతీ బంగారయ్యపేటలో 'స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమానికి హాజరైన అనంతరం అనకాపల్లి నియోజకవర్గ ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం ఏర్పాటుచేశారు. టీడీపీ నాయకులు ప్రజలతో మమేకమవుతూ ఉ ండాలని, కార్యకర్తల మనోభీష్టం మేరకే ముందుకువెళ్లాలని సూచించారు. గత ప్రభుత్వంలో జరిగిన విధ్వంసాలపై ప్రజల్లో చర్చ జరగాలన్నారు. సూపర్ సిక్స్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని, గ్రామస్థాయిలో ప్రతి కార్యకర్త పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే ఉన్నా, అభివృద్ధికి అన్నివిధాలా ప్రభుత్వం నిధుల కేటాయింపు జరుపుతోందన్నారు. జనసేన, బీజేపీ నాయకులతో ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం సీఎం చంద్రబాబునాయుడు ప్రతి కార్యకర్తతో, గ్రామ, మండల, గ్రామ కమిటీల నేతలతో ఫొటోలు దిగారు. సమావేశంలో జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవింద్ర, హెూం మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జి పీలా గోవింద సత్యనారాయణ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, రత్నాకర్, అనకాపల్లి, కశింకోట మండలాల అధ్యక్షులు బాబీ, గొంతిన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో 'ముస్తాబు'



**నమస్తే హైదరాబాద్ :** విశాఖపట్నంలో మరో అతి పెద్ద పర్యాటక ప్రాజెక్టు రానుంది. హైదరాబాద్, చెన్నై, బెంగళూరుల్లో మాదిరిగా విశాఖలో థీమ్ పార్క్ ఏర్పాటుకు 'వండర్లా' గ్రూపు ముందుకువచ్చింది. ఈ విషయాన్ని ఇటీవల విజయవాడలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో పర్యాటక శాఖ ప్రధాన కార్యదర్శి అజయ్జైన్ వెల్లడించారు. ఇందుకోసం విశాఖలో 50 ఎకరాలు కేటాయించనున్నట్టు తెలిపారు. వండర్లా దేశ వ్యాప్తంగా థీమ్ పార్కులు నిర్వహిస్తున్నది. ఆ పార్కుల్లో అన్నీ నిబంధనల ప్రకారమే జరుగుతాయి. పిల్లల నుంచి పెద్దల వరకు అంతా ఆడి పాడి ఆనందించే కార్యక్రమాలు నిర్వహిస్తారు. జాయ్ రైడ్స్, వాటర్ గేమ్స్ వంటివి ఉంటాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ పర్యాటక ప్రాజెక్టులను త్వరితంగా గ్రౌండింగ్ చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ను ఆదేశించారు. స్టీల్ప్లాంటులోని బ్లాస్ట్ఫర్నేస్ విభాగంలో మరోసారి రికార్డు స్థాయిలో హాట్ మెటల్ ఉత్పత్తి జరిగింది. గడిచిన ఆదివారం 21,205 టన్నుల ఉత్పత్తి జరగ్గా, తాజాగా శుక్రవారం ఉదయం ఆరు నుంచి శనివారం ఉదయం ఆరు గంటల వరకు ఏ,బీ,సీ మూడు షిఫ్ట్లలో కలిపి 21,531 టన్నుల ఉ త్పత్తి సా?ధించడంతో కొత్త రికార్డు నమోదయ్యింది. బ్లాస్ట్ ఫర్నేస్-1లో 6,328 టన్నులు, బ్లాస్ట్ ఫర్నేస్-2లో 6,825 టన్నులు, బ్లాస్ట్ ఫర్నేస్-3లో 8,378 టన్నులు కలిపి మొత్తం 21531 టన్నుల ఉత్పత్తి జరిగింది. బ్లాస్ట్ఫర్నేస్ విభాగంలో ఉత్పత్తి అధిక మొత్తంలో సాధించడంతో స్టీల్ మెల్ట్షాప్ (ఎస్ఎంఎస్)-1 విభాగంలో 66 హీట్లు (భారీ సైజు కలిసిన ఇనుప దిమ్మలు), ఎస్ఎంఎస్-2 విభాగంలో 67 హీట్లు...మొత్తం 133 హీట్ల ఉత్పత్తి జరిగింది. 'స్పోర్ట్స్ ఎరీనా' నిర్వాహకులపై జీవీఎంసీ కమిషనర్ సీరియస్ నెలాఖరులోగా 80 శాతం అద్దె బకాయిలు చెల్లించాలని ఆదేశం లేనిపక్షంలో స్టేడియం లీజును రద్దు చేస్తామని హెచ్చరికఎంవీపీ కాలనీలోని 'స్పోర్ట్స్ ఎరీనా' నిర్వాహకులపై జీవీఎంసీ కమిషనర్ కేతన్గార్గ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ.25 కోట్లతో జీవీఎంసీ స్పోర్ట్స్ ఎరీనా కాంప్లెక్స్ను నిర్మించింది. దీనిని ఒక ప్రైవేటు సంస్థకు అద్దెకు (మూడు నెలలకు రూ.28 లక్షలు) ఇచ్చింది. అయితే స్పోర్ట్స్ ఎరీనాను దక్కించుకున్న సంస్థ జీవీఎంసీకి సక్రమంగా అద్దె చెల్లించకపోవడంతో ప్రస్తుతం బకాయి రూ.1.2 కోట్ల మేర పేరుకుపోయింది. ఈ విషయమై 'గ్రేటర్తో గేమ్స్' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కమిషనర్ కేతన్గార్గ్ స్పోర్ట్స్ ఎరీనా నిర్వాహకుడిని కిర్లంపూడి లేఅవుట్లోని స్మార్ట్ సిటీకార్యాలయానికి పిలిపించినట్టు తెలిసింది. అద్దె సక్రమంగా చెల్లించకపోవడంపై ప్రశ్నించినట్టు సమాచారం. స్టేడియానికి వచ్చే క్రీడాకారులు, పిల్లల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తూ, అద్దెను సక్రమంగా చెల్లించకపోవడంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ నెలాఖరులోగా 80 శాతం అద్దె బకాయి చెల్లించాలని, లేనిపక్షంలో లీజు రద్దు చేస్తానని హెచ్చరించినట్టు సమాచారం. అలాగే స్పోర్ట్స్ ఎరీనా పేరుతో ఎస్క్రో ఖాతాను తెరిచి, ఫీజుగా వచ్చిన మొత్తంలో మూడు నెలల అద్దె ఆటోమేటిక్గా జీవీఎంసీకి చెల్లింపు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు తెలిసింది. అద్దె బకాయి చెల్లించలేదని తన దృష్టికి వస్తే మరో అవకాశం కూడా ఇవ్వకుండా స్పోర్ట్స్ ఎరీనాను స్వాధీనం చేసుకుంటామని కమిషనర్ స్పష్టంచేసినట్టు జీవీఎంసీ అధికారి ఒకరు తెలిపారు.

# ఈ నెల 27వ తేదీన మోటాటి రెడ్డి, మున్నూరు కాపు స్మశాన వాటిక అభివృద్ధి కొత్త సేవా కమిటీ ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానం






**ఉప్పల్, డిసెంబర్ 20 ( నమస్తే హైదరాబాద్):** ఉప్పల్ మోటాటి రెడ్డి, మున్నూరు కాపు స్మశాన వాటిక కమిటీ సర్వసభ్య సమావేశం ఉప్పల్ లక్ష్మా రెడ్డి కాలనీ అసోసియేషన్ హల్ లో మేకల హనుమంత్ రెడ్డి అధ్యర్యంలో శనివారం జరిగింది. సమావేశంలో స్మశాన వాటిక అభివృద్ధి, కొత్త సేవ కమిటీ నిర్వహించాలని తీర్మాణించడం జరిగింది. ఈ నెల 27వ తేదీ శనివారం మరోసారి కమిటీ సమావేశం నిర్వహించి కొత్తగా సేవా కమిటీని ఎన్నుకోవాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశానికి సదరు అధ్యక్షులు, కార్యదర్శులు గైరాజరయ్యారు. సమావేశానికి మోటాటి రెడ్డి బంధువులు, మున్నూరు కాపు సోదరులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గొనె విద్యాసాగర్ రెడ్డి, మేకల వెంకట్ రెడ్డి, గిరి రామకృష్ణ, నయాబు వెంకటేష్, సుక్క చంద్రమోహన్,గొనె అర్జున్ రెడ్డి, మేకల దయాసాగర్ రెడ్డి,శామీర్ పేట ధర్మారెడ్డి, మందుముల అంజిరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పూడూరి జితేందర్ రెడ్డి, ఇతర కుల బంధువులు పాల్గొన్నారు.

# రైతులకు వరంగా కేంద్ర ప్రభుత్వ పథకం.. ఏడాదికి రూ. 20 లక్షలు సంపాదించే ఛాన్స్

**నమస్తే హైదరాబాద్ :** రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అన్నదాతకు అదనపు ఆదాయం కోసం 'పీఎం కుసుమ్' పథకం తీసుకొచ్చింది. సాగుకు యోగ్యం కాని బంజరు భూములను విద్యుత్ కేంద్రాలుగా మార్చి.. అన్నదాతలకు అదనపు ఆదాయం కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం. దీని ద్వారా రైతులు తమ పొలాల్లో సౌర విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఇప్పటివరకు సుమారు 750 దరఖాస్తులు అందగా.. విద్యుత్ ఉపకేంద్రాలకు 5 కిలోమీటర్ల పరిధిలో భూమి ఉన్నవారికే ఈ అవకాశం లభిస్తోంది. ప్రారంభ పెట్టుబడి కొంత ఎక్కువగా ఉన్నప్పటికీ.. ఇది 25 ఏళ్ల పాటు స్థిరమైన ఆదాయాన్ని ఇచ్చే అద్భుతమైన పథకం.పీఎం కుసుమ్ పథకం కింద ఒక రైతు కనిష్ఠంగా 0.5 మెగావాట్ల (500 కిలోవాట్ల) నుంచి గరిష్ఠంగా 2 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. అర మెగావాట్ ప్లాంట్ ఏర్పాటుకు సుమారు రూ. 1.50 కోట్ల పెట్టుబడి అవసరమవుతుంది. ఇందులో బ్యాంకుల ద్వారా 70 శాతం వరకు రుణ సదుపాయం లభిస్తుంది. 0.5 మెగావాట్ ప్లాంట్ ద్వారా ఏడాదికి సగటున 7.5 లక్షల నుంచి 8 లక్షల యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ప్రభుత్వం నిర్ణయించిన టారిఫ్ యూనిట్కు సుమారు రూ. 3.13 ప్రకారం, ఏడాదికి రూ. 22 లక్షల నుంచి రూ. 25 లక్షల ఆదాయం వస్తుంది. బ్యాంక్ లోన్ వాయిదాలు, నిర్వహణ ఖర్చులు పోను రైతుకు నికరంగా ఏడాదికి రూ. 15 నుండి రూ. 20 లక్షల వరకు ఆదాయం మిగిలే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. చాలా చోట్ల రైతులు సాగుకు పనికిరాని భూములను వృథాగా వదిలేస్తున్నారు. అటువంటి భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం వల్ల అటు విద్యుత్ ఉత్పత్తి అవ్వడమే కాకుండా, రైతుకు నెలకు లక్షల్లో ఆదాయం లభిస్తుంది. ఉత్పత్తి చేసిన విద్యుత్తును నేరుగా డిస్కంలే కొనుగోలు చేస్తాయి కాబట్టి మార్కెటింగ్ సమస్య ఉండదు. రైతు వ్యక్తిగతంగా లేదా రైతు సంఘాలు కలిసి ఈ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చని తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ సంతోష్ పేర్కొన్నారు. రైతులు తమ సిబిల్ స్కోర్ ఆధారంగా బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు పొందేలా ప్రభుత్వం సమన్వయం చేస్తోంది. 2047 నాటికి కర్బన ఉద్గారాలను తగ్గించాలనే లక్ష్యంలో భాగంగా చేపట్టిన ఈ పథకం రైతులకు ఆర్థికంగా పెద్ద ఊరటనివ్వనుంది.

## కర్ణాటక ముఖ్యమంత్రి పదవి విషయం అధిష్ఠానం చేతుల్లో ఉందన్న డీకే శివకుమార్




**నమస్తే హైదరాబాద్ :** కర్ణాటక కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవికి సంబంధించిన నాయకత్వ పోరు మరోసారి బహిర్గతమైంది. సరైన సమయంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను, తనను ఢిల్లీకి పిలుస్తామని పార్టీ అధిష్ఠానం తెలిపిందని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ శనివారం వెల్లడించారు. ఈ పరిణామంతో సీఎం మార్పుపై జరుగుతున్న చర్చకు మరింత బలం చేకూరినట్లయింది.బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల తర్వాత అధిష్ఠానంతో సమావేశం ఉంటుందా అని అడిగిన ప్రశ్నకు శివకుమార్ స్పందించారు. ఎప్పుడు ఢిల్లీ వెళ్లాలో మా ఇద్దరికీ హైకమాండ్ ఫోన్‌లో తెలియజేసింది. పిలుపు వచ్చినప్పుడు మేమిద్దరం కలిసి వెళతాం. ఆ విషయాన్ని మీడియాకు చెప్పకుండా దొంగచాటుగా వెళ్లాల్సిన అవసరం లేదు అని ఆయన అన్నారు.అయితే మంగళవారం తాను అధికారిక పనుల మీద ఢిల్లీ వెళుతున్నానని శివకుమార్ తెలిపారు. నదుల అనుసంధానంపై కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొంటానని చెప్పారు. ఈ సందర్భంగా మహదాయి కృష్ణా జలాలు మేకెదాటు అప్పర్ భద్ర ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళతానని, అవసరమైతే ప్రధానిని కూడా కలుస్తానని వివరించారు.ఐదేళ్ల పాటు తానే సీఎంగా కొనసాగుతానని, అధికార పంపకాల ఒప్పందం ఏదీ లేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో డీకే శివకుమార్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే ముఖ్యమంత్రి, నేను, హైకమాండ్ ఒక ఒప్పందానికి కట్టుబడి ఉన్నాం అని శివకుమార్ స్పష్టం చేశారు. దీంతో కర్ణాటక సీఎం కుర్చీ వివాదం ఇప్పుడు అధిష్ఠానం చేతుల్లోకి వెళ్లినట్లయింది

## బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులని ఖండించాలి

**నమస్తే హైదరాబాద్ :** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల పట్ల దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ హింసను 'నరమేధం'గా అభివర్ణించిన ఆయన, ఈ దాడులను ఖండించని వారు అసలు భారతీయులేనా? అంటూ సంచలన ప్రశ్నలు సంధించారు.ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ, మతం పేరుతో సాగుతున్న ఈ హింస మానవత్వానికే మాయని మచ్చ అని ఆవేదన వ్యక్తం చేశారు. "బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అమానుష దాడులను ఖండించకుండా మౌనంగా ఉన్న రాజకీయ పార్టీలకు, నాయకులకు ఈ దేశంలో కొనసాగే నైతిక హక్కు ఉందా?" అని నిలదీశారు. భారతదేశం సహనానికి, మత సామరస్యానికి ప్రతీక అని, అలాంటి దేశంలో ఉంటూ ఈ దాడులపై స్పందించకపోవడం దేశభక్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు.ఇది కేవలం ఒక దేశ సమస్య కాదని, అంతర్జాతీయ మానవ హక్కుల ఉల్లంఘన అని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. బాధితుల పక్షాన నిలబడకుండా మౌనం పాటించడం అనైతికమని, ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించడమేనని అన్నారు. ఈ దాడులను ఖండించలేని వారిని మనమే దేశం నుంచి బహిష్కరిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

## కేంద్ర బడ్జెట్ ప్రకటనకు డేట్ ఫిక్స్.. ఈ సారి ఎప్పుడంటే..?




**నమస్తే హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రకటనకు ముహూర్తం ఖరారు అయింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను వచ్చే ఏడాది ఫిబ్రవరి 1వ తేదీన(ఆదివారం) పార్లమెంట్‌లో కేంద్రం ప్రకటించనుంది. ఈ సారి కూడా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆ రోజున బడ్జెట్‌ను ఉభయ సభల్లో ప్రవేశపెట్టనున్నారు. ఆ రోజు కేంద్ర కేబినెట్ ఆమోదించాక నిర్మలా పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రసంగం చేయనున్నారు. ఈ మేరకు ఇప్పటినుంచే కేంద్ర బడ్జెట్‌పై కసరత్తు జరుగుతోంది. వేటికి ఎన్ని నిధులు కేటాయించాలనే దానిపై ఇప్పటినుంచే చర్చలు జరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం పెరుగుతుండటం, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ భారీగా పతనం కావడంతో వివిధ వస్తువుల ధరలు పెరుగుతున్న క్రమంలో కేంద్ర బడ్జెట్ ఎలా ఉంటుందనేది చర్చనీయాశంగా మారింది.

ఫిబ్రవరి 1వ తేదీన ఈ సారి ఆదివారం వచ్చినప్పటికీ.. అదే డేట్‌ను ఫిక్స్ చేయడం వెనుక అనేక కారణాలు ఉన్నాయి. 2017 నుంచి ఫిబ్రవరి 1వ తేదీనే బడ్జెట్‌ను మోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. ఆ సంప్రదాయాన్ని కొనసాగించడంలో భాగంగా.. ఆదివారం వచ్చినప్పటికీ బడ్జెట్ ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమవుతుంది. పార్లమెంట్‌లో బడ్జెట్ ఆమోదం కోసం తగినంత సమయం కల్పించడనికి రెండు నెలల ముందే ప్రవేశపెడుతున్నారు. అంతేకాకుండా కొత్త ఆర్థిక సంవత్సరం తొలి రోజు నుంచే సజావుగా నిధుల కేటాయింపు జరగడంతో పాటు మధ్యలోనే వచ్చే అంతరాయాలను తొలగిస్తుంది.2017కి ముందు ఫిబ్రవరి చివరి వారంలో బడ్జెట్ ప్రవేశపెట్టేవారు. అయితే 2017లో అప్పటి ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టి విప్లవాత్మక మార్పు తీసుకొచ్చారు. మార్చి చివరకు పార్లమెంట్ ఆమోదించడానికి, పాలనను క్రమబద్ధీకరించడానికి, మార్కెట్ల అనిశ్చితిని తగ్గించడానికి ఇది ఉపయోగపడుతుంది.

## తిరుమలలోని కౌస్తుభం భవనంలో కోడిగుడ్లు... టీటీడీ సీరియస్

**నమస్తే హైదరాబాద్ :** తిరుమలలోని ఓ విశ్రాంతిగృహంలో కోడిగుడ్లు బయటపడటం కలకలంరేపింది. ఓ భక్తుడు ఈ కోడిగుడ్లను తీసుకొచ్చినట్లు ప్రచారం జరిగింది. ఈ వ్యవహారం బయటపడటంతో కలకలం రేగింది. ఓ వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాస్ నాయక్ ఈ అంశంపై సోషల్ మీడియాలో వీడియో కూడా విడుదల చేశారు. ఈ నెల 17న తిరుమలలోని కౌస్తుభం భవనంలోని 538 గదిలో తాను గదిని తీసుకున్నానని.. ఆ గదిని శుభ్రం చేసిన పారిశుద్ధ్య కార్మికులు లోపలి నుంచి కోడిగుడ్లు ఉన్న కవర్ బయట పడేయడాన్ని గమనించానన్నారు. అయితే ఆ వీడియోలో ఆయన ఎలాంటి కోడిగుడ్లను మాత్రం చూపించలేదు. ఈ అంశంపై టీటీడీ కూడా స్పందించింది.. ఈ మేరకు ట్వీట్ చేసింది.'తిరుమలలోని కౌస్తుభం వసతి గృహంలో 538వ గదిలోకి ఒక యాత్రికుడు నిషేధిత వస్తువులైన కోడి గుడ్లను తెచ్చినట్లు మా దృష్టికి వచ్చింది. ఈ అంశానికి సంబంధించి విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవం జరిగింది. అలాగే నిషేధిత వస్తువులైన కోడిగుడ్లను తీసుకొచ్చిన సదరు వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది' అని టీటీడీ తెలిపింది. భక్తులు ఫేక్ న్యూస్, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని నమ్మొద్దన్నారు. టీటీడీ అధికారికంగా విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే నమ్మాలన్నారు. అయితే ఓ భక్తుడు కొండపైకి కోడిగుడ్లను ఎలా తీసుకొచ్చారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మూడు రోజుల క్రితం కూడా ఇద్దరు తమిళనాడు యువకులు తిరుమలలో రెచ్చిపోయారు. ఓ రాజకీయ పార్టీకి సంబంధించిన బ్యానర్‌ను ప్రదర్శించారు.. ఈ వీడియో వైరల్ అయ్యింది. ఈ అంశంపై కూడా టీటీడీ స్పందించింది. 'తమిళనాడుకు చెందిన కొందరు వ్యక్తులు శ్రీవారి ఆలయ పరిసరాల్లో రాజకీయ నాయకుల ఫోటోలతో ఉన్న ఫ్లెక్సీ బ్యానర్‌ను టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా



ప్రదర్శించినట్లు మా దృష్టికి వచ్చింది. ఆ బ్యానర్‌ను ప్రదర్శించడమే కాకుండా రీల్స్ తీసి సోషల్ మీడియాలో కూడా పోస్ట్ చేసినట్లు తెలిసింది. సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని టీటీడీ తెలియజేస్తోంది.' అని టీటీడీ ఒక ప్రకటనను విడుదల చేసింది.

## గువాహటిలో శ్రీవారి ఆలయం.. 25 ఎకరాలు కేటాయించిన అస్సాం ప్రభుత్వం



**నమస్తే హైదరాబాద్ : నమస్తే హైదరాబాద్ :** దేశంలోని ప్రతి రాష్ట్రంలో శ్రీవారి ఆలయం నిర్మించాలని తిరుమల తిరుపతి దేవస్థానం సంకల్పించిన సంగతి తెలిసిందే. ప్రతి రాష్ట్రంలో శ్రీవారి ఆలయం ఉండాలని టీటీడీతో పాటుగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల బిహార్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం అక్కడి ప్రభుత్వం టీటీడీకి భూములు కేటాయించిన సంగతి తెలిసిందే. తాజాగా మరో రాష్ట్రం శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం భూములు కేటాయించింది. అస్సాంలోని గువాహటిలో శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం అస్సాం ప్రభుత్వం భూమి కేటాయించింది. మొదట నిర్ణయించిన10.8 ఎకరాల భూమికి బదులుగా శ్రీవారి ఆలయం కోసం 25 ఎకరాల భూమిని కేటాయిస్తూ అస్సాం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏపీ ముఖ్యమంత్రి, అస్సాం సీఎంల మధ్య సంప్రదింపుల తర్వాత అక్కడి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుందని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు.

మరోవైపు గువాహటి సమీపంలోని కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో శ్రీవారి ఆలయం నిర్మాణం కోసం 10.8 ఎకరాల భూమి కేటాయించేందుకు అస్సాం ప్రభుత్వం గతంలోనే అంగీకరించింది. అయితే డిసెంబర్ నెలలో అస్సాం ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి ద్వివేది.. టీటీడీకి ఓ లేఖ రాశారు. గువాహటిలోని గర్చుక్‌లో ఇప్పటికే శ్రీవారి ఆలయం ఉందని.. ఇప్పుడు కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో శ్రీవారి ఆలయం నిర్మిస్తే.. గర్చుక్‌లోని ఆలయ ప్రయోజనాలకు భంగం కలిగే అవకాశం ఉందని.. ఆలయ నిర్వాహకుల అభిప్రాయపడుతున్నారని టీటీడీకి వివరించారు. ఈ నేపథ్యంలో టీటీడీ.. శ్రీవారి ఆలయాన్ని సిల్చార్ లేదా డిబ్రూగఢ్‌లలో ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈ నేపథ్యంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మకు లేఖ రాసిన చంద్రబాబు.. దేశంలోని ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంలో శ్రీవారి ఆలయాన్ని నిర్మించేందుకు చేపడుతున్న చర్యలు.. హిందూ సనాతన ధర్మం విస్తరణకు ఏపీ ప్రభుత్వం, టీటీడీ తీసుకుంటున్న చర్యలను వివరించారు. అలాగే అమరావతిలో 25 ఎకరాల్లో శ్రీవారి ఆలయాన్ని నిర్మిస్తున్న సంగతిని వివరించారు. ఈ క్రమంలోనే గువాహటిలో శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం 25 ఎకరాల భూమి కేటాయించాలని చంద్రబాబు కోరారు.ఈశాన్య భారతదేశానికి గువాహటి కేంద్రంగా ఉన్న నేపథ్యంలో, భక్తుల సౌకర్యాలు, నిత్యాన్నదానం వంటి కార్యక్రమాలతో ఆలయాన్ని ఏర్పాటు చేయడానికి 25 ఎకరాల భూమిని కేటాయించాలని చంద్రబాబు సిఫార్సు చేశారు. చంద్రబాబు విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన అస్సాం సీఎం.. గువాహటిలో శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం టీటీడీకి 25 ఎకరాల భూమిని కేటాయించేందుకు సూత్రప్రాయంగా అంగీకరించారు. అలాగే ఈ ప్రాజెక్టు కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించేందుకు అంగీకరించినట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు

## ఏపీ విద్యార్థులకు కొత్త కార్యక్రమం స్టార్ట్

**నమస్తే హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్‌లోని విద్యార్థులకు ముఖ్య గమనిక. విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త కార్యక్రమం తీసుకువచ్చింది. సీఎం నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. సీఎం చంద్రబాబు నాయుడు శనివారం అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలో పర్యటించారు. ఈ సందర్భంగా తాళ్లపాలెం గురుకుల పాఠశాలను సందర్శించిన చంద్రబాబు.. విద్యార్థుల కోసం 'ముస్తాబు' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీంతో శనివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ముస్తాబు కార్యక్రమం అమల్లోకి వచ్చింది. ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం.. అక్కడి విద్యార్థులతో చంద్రబాబు ముచ్చటించారు. వివిధ అంశాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు.

ముస్తాబు కార్యక్రమం అంటే.. మరోవైపు విద్యార్థులలో వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఏపీ ప్రభుత్వం ఈ ముస్తాబు కార్యక్రమాన్ని తీసుకువచ్చింది. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో దీనిని అమలు చేయనున్నారు. ముస్తాబు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, క్రమశిక్షణ, మంచి అలవాట్లు, ఆత్మవిశ్వాసం పెంచే పనులు చేపట్టనున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ విధానం పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయగా.. అక్కడ మంచి ఫలితాలు వచ్చాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించారు. ఇక ముస్తాబు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లోని ప్రతి తరగతి గదిలో ముస్తాబు కార్నర్ ఏర్పాటు చేస్తారు. విద్యార్థులు ఎవరైనా ఇంటిదగ్గర సరిగా తయారై స్కూలుకు రాకపోతే.. అలాంటి విద్యార్థులను గుర్తించి, ముస్తాబు కార్నర్ వద్ద వారిని ముస్తాబు చేస్తారు. వారిని ముఖం కడుక్కుని, తల దువ్వుకుని చక్కగా తయారై వచ్చాకే క్లాస్ రూమ్‌లోకి అనుమతిస్తారు. ఇందుకోసం ముస్తాబు కార్నర్ వద్ద అద్దం, సబ్బు, నెయిల్ కట్టర్, దువ్వెన, హ్యాండ్ వాష్, టవల్ వంటి ఏర్పాట్లు చేస్తారు. మరోవైపు



ముస్తాబు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు రోజూ శుభ్రమైన యూనిఫాం, చెప్పులు ధరించి స్కూలుకు రావటంతో పాటుగా.. గోళ్లు, హెయిర్ కటింగ్ వంటివి చక్కగా ఉండేలా స్కూలు సిబ్బంది పర్యవేక్షణ ఉంటుంది. అలాగే.. టాయిలెట్‌కు వెళ్లి వచ్చిన సమయంలో, భోజనానికి ముందు సబ్బుతో చేతులు శుభ్రపరుచుకునేలా చర్యలు తీసుకుంటారు.వ్యక్తిగత పరిశుభ్రతపై చార్టులు, పోస్టులు ఏర్పాటు చేస్తారు. మరోవైపు విద్యార్థులలో వ్యక్తిగత పరిశుభ్రతను ప్రోత్సహించడానికి ప్రతి వారం ముస్తాబు స్టార్ పేరుతో ప్రోత్సాహకాలు అందిస్తారు. వారపు ముస్తాబు స్టార్ పేర్లను ప్రకటిస్తారు. అలాగే నెలవారీ పరిశుభ్రమైన తరగతి గది, వసతి గృహం అవార్డులు అందిస్తారు. అలాగే జిల్లాస్థాయిలో ఉత్తమ పాఠశాల, వసతి గృహం అవార్డులు కూడా అందిస్తారు.

## రైతుల బాధలు అధికారులు అర్థం చేసుకోవాలి! ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

**నమస్తే హైదరాబాద్ :** వలేటివారిపాలెం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజాదర్బార్ శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు ఎక్కువగా భూ సమస్యలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదులు చేశారు. వివాదాస్పదం లేని, అధికారుల తప్పిదం వల్ల జరిగిన సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. రైతుల బాధలను అర్థం చేసుకోవాలన్నారు. ప్రజా దర్బార్ లో వచ్చే అర్జీలన్నీ ముఖ్యమంత్రి కార్యాలయం లాగిన్ లో నమోదు చేస్తున్నట్లు చెబుతూ... ప్రతి అర్జీ పరిష్కారం అయ్యేవరకు పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా, ఆన్లైన్ లో తప్పులు, భూముల విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, కొన్నిచోట్ల భూములు 22ఏ లో నమోదు కావడం, మ్యుటేషన్లు లాంటి సమస్యలపైనే రైతులు దృష్టికి తీసుకువచ్చారు. నెలల తరబడి అర్జీలు ఇవ్వటమే తప్ప పరిష్కారం కావడం లేదని అన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం కారణంగానే తప్పులు దొర్లాయని అన్నారు. రీసెర్వేల్లో జరిగిన తప్పులను సరిదిద్దడానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీటివల్ల పంట రుణాలు ఇవ్వటానికి బ్యాంకులు అభ్యంతరం తెలుపుతున్నాయని, ఆ విషయాన్ని ఇటీవల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అధికారులు ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలాగా పనిచేయాలని, ఈ అర్జీల పరిష్కార బాధ్యత అధికారులదేననీ అన్నారు. రైతులు ఇచ్చిన ప్రతి అర్జీని ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, వారి ఆవేదనను విన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో



శంకరరావు తహసిల్దార్ నయీం అహ్మద్, మామిళ్ళపల్లి మాధవ, మానికే కొండయ్య, మండలంలోని ఆయా గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# ముస్తాబు కలెక్టర్ తవణంపల్లె బిడ్డ



**నమస్తే హైదరాబాద్ :** చిత్తూరు, : పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రతను అలవాటు చేసేందుకు పార్వతీపురం జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో ముస్తాబు అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ జిల్లా పర్యటనలో సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమం గురించి విద్యార్థుల ద్వారా తెలుసుకుని దాని రూపకర్త మన్యం జిల్లా కలెక్టర్ నక్కల ప్రభాకర రెడ్డిని అభినందించారు. అంతేకాదు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో శనివారం నుంచి ముస్తాబు కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ముస్తాబు కోసం ప్రతి తరగతి, వసతిగృహంలో ప్రత్యేక కార్నర్‌ను ఏర్పాటు చేస్తున్నారు.'ముస్తాబు' కార్యక్రమానికి పురుడుపోసిన అధికారి నక్కల ప్రభాకర రెడ్డి సొంతూరు చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలంలోని వెంగంపల్లె . కష్టజీవి. పత్రికా విలేకరిగా పనిచేస్తూనే పోటీ పరీక్షలు రాసి గ్రూప్–1 అధికారి అయ్యారు. అంచెలంచెలుగా అనేక హోదాల్లో పనిచేస్తూ ఐఏఎస్ అయ్యారు. రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిన పథక రూపకర్త ప్రభాకర రెడ్డి జీవన ప్రస్థానమిది.

కోచింగ్ సెంటర్ ప్రారంభించి..

2001లో చిత్తూరు కేంద్రంగా ఆయన టైమ్స్ అనే ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించారు. పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యేవారికి ఇక్కడ మ్యాథ్స్ చెప్పేవారు.. తర్వాతి క్రమంలో ఈ ఇన్‌స్టిట్యూట్‌ను తిరుపతిలో కూడా ప్రారంభించారు. 2006లో గ్రూప్–1 పరీక్షల్లో ఉమ్మడి రాష్ట్రంలో 5వ ర్యాంకు తెచ్చుకున్నారు. 2007 బ్యాచ్ గ్రూప్–1 అధికారిగా డిప్యూటీ కలెక్టర్ (ఆర్డీవో) పోస్టు లభించింది.

సామాజిక, సాహిత్య రంగాల్లో..

సామాజిక, సేవా కార్యక్రమాల్లోనూ ప్రభాకర రెడ్డి చురుగ్గా పాల్గొనేవారు. తెలుగు భాషా ఉద్యమ సమాఖ్య జిల్లా సమన్వయకర్తగా, జిల్లా రచయితల సంఘం కార్యదర్శిగా, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శిగా సేవలందించారు.ప్రభాకర రెడ్డి మంచి రచయిత కూడా. నవలలు, కథలు రాశారు. చతురలో అచ్చయిన 'రాలనిపువ్వు' నవల బాగా ప్రాచుర్యం పొందింది. ఇందులో హీరో జర్నలిస్టే. అస్త్రం అనే పత్రికలో డైలీ సీరియల్ రాశారు. ఆంధ్రజ్యోతి సండే మ్యాగజైన్, నవీన పేజీల్లో కథనాలు రాసేవారు. కవి సమ్మేళనాలు, రేడియో కార్యక్రమాల్లో పాల్గొనేవారు.ఐఏఎస్ అధికారిగా..

2018లో ఒంగోలు డీఆర్వోగా పనిచేసేటప్పుడు ప్రభాకర రెడ్డికి ఐఏఎస్ ప్రకటించారు. 2013 బ్యాచ్ ఐఏఎస్ అధికారి హోదాలో సర్వే సెటిల్‌మెంట్ స్టేట్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత నెల్లూరు జాయింట్ కలెక్టర్‌గా, శాప్ ఎండీగా విధులు నిర్వర్తించారు. రెవెన్యూలో అత్యంత కీలకమైన సీసీఎల్ఏ అడిషనల్ చీఫ్ కమిషనర్‌గా చేశాక, ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

రెవెన్యూ క్లీనిక్' ఈయన ఆలోచనే

మాతృశాఖ రెవెన్యూ కావడం, సీసీఎల్ఏలో పనిచేసిన అనుభవం తోడవ్వడంతో కలెక్టర్‌గా ఉన్న పార్వతీపురంలో రెవెన్యూ క్లినిక్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెవెన్యూలోని రకరకాల సమస్యలను కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి పరిష్కరిస్తున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో బాగా యాక్టివ్‌గా ఉండే ప్రభాకర రెడ్డి పార్వతీపురం జిల్లాలోని జలపాతాలను తొలిసారి ప్రపంచానికి పరిచయం చేశారు.అక్కడికి వెళ్లే దారుల్ని అభివృద్ధి చేశారు. ప్రస్తుతం నెలకు 2 లక్షలమంది వాటిని సందర్శిస్తున్నారు.ప్రతిచోటా తన ముద్ర

ఎక్కడ ఉద్యోగం చేసినా ఆయా ప్రాంతాలకు అనుగుణంగా సంస్కరణలకు నాంది పలికి, పాలనలో తన ముద్ర వేశారు. మహబూబ్ నగర్‌లో శిక్షణ పూర్తి చేసుకుని జమ్మలమడుగు ఆర్డీవోగా తొలి పోస్టింగ్ తీసుకున్నారు. అక్కడ ఫ్యాక్షన్ కుటుంబాలను కాంప్రమైజ్ చేసి కలిపారు. కర్నూలు యూత్ సర్వీసెస్ సీఈవోగా బాల్య వివాహాల్ని అరికట్టేందుకు ఉద్యమం చేశారు. వికారాబాద్ ఆర్డీవోగా మీభూమి–మీహక్కు, రెవెన్యూ అదాలత్ కార్యక్రమాలను ప్రయోగాత్మకంగా అమలు చేశారు. రెవెన్యూ శాఖను ఆన్‌లైన్ చేసే విధానంపై ప్రభుత్వానికి చెందిన మనటీవీలో రెవెన్యూ అధికారులకు శిక్షణ ఇచ్చారు. శ్రీశైలం ఐటీడీఏ పీవోగా గర్భిణుల మరణాలను నిరోధించారు. అక్కడి చెంచులకు ఓటు హక్కును కల్పించి సుమారు 26 మందికి ప్రజాప్రతినిధులయ్యే అవకాశాన్ని కల్పించారు. రాష్ట్ర విభజన తర్వాత అమరావతి సీఆర్డీఏలో ఐటీ డైరెక్టర్ బాధ్యతలు చేపట్టి అక్కడ ఆన్‌లైన్ విధానంలో భూసేకరణ చేశారు.

సొంతూరు తవణంపల్లె

మునెమ్మ, దొరసామిరెడ్డి తల్లిదండ్రులు. 7వ తరగతి వరకు వెంగంపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో, 8 నుంచి 10 వరకు ఐరాల మండలంలోని ఎం.పైపల్లె ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. ఇంటర్మీడియట్ చిత్తూరులోని పీసీఆర్ కళాశాలలో, డిగ్రీ పీవీకేఎన్‌లో చదువుకున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదువంతా సాగింది. 1997లో డిగ్రీ పూర్తయ్యాక తిరుపతికి వెళ్లారు.

రిపోర్టర్‌గా కొన్నాళ్లు..

తిరుపతిలో 1998 నుంచి 2001 వరకు కొన్ని పత్రికల్లో విలేకరిగా పనిచేశారు. ఇదే సమయంలో ఎస్వీ యూనివర్శిటీలో ఎమ్మెస్సీ మ్యాథ్స్ డిస్టెన్స్‌లో పూర్తి చేశారు. చదువు ఒక దాహం. ఆ తర్వాత ఆయన ఎంఏ, ఎంబీఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ (మ్యాథ్స్) పూర్తి చేశారు.

# ఏయూకు 2017లో రూ.100 కోట్లు మంజూరు

**అందులో కేంద్రం వాటా రూ.60 కోట్లు, రాష్ట్ర వాటా రూ.40 కోట్లు**

**రాష్ట్ర వాటా విడుదల చేయకపోవడంతోకేంద్రం నిధులు పూర్తిగా వినియోగించుకోలేని పరిస్థితి**

**వచ్చే మార్చిలోగా ఆ నిధులు వినియోగించాలని కేంద్రం ఆదేశాలు**

**మ్యాచింగ్ గ్రాంటు విడుదలకు ముందుకొచ్చిన మంత్రి నారా లోకేశ్**

**....అయినా రూ.30 కోట్ల విడుదలకు సాంకేతిక ఇబ్బందులు ఉన్నట్టు చెబుతున్న అధికారులు**

**ప్రత్యేక చొరవ తీసుకోనట్టయితే నిధులు మురిగిపోయే ప్రమాదం**




**నమస్తే హైదరాబాద్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయానికి మంజూరైన రూసా 2.0 నిధులను వినియోగించుకోవడంలో పాలకులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. సుమారు ఎనిమిదేళ్ల కిందట మంజూరైన నిధులను వినియోగించుకోకపోవడంతో ఇప్పుడు రూ.30 కోట్లు మురిగిపోయే పరిస్థితి నెలకొంది. విశ్వవిద్యాలయాల్లో పరిశోధన, బోధన సామర్థ్యాలను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడం, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ రాష్ట్రీయ ఉచ్ఛతార్ శిక్ష అభియాన్ (రూసా) కింద నిధులను మంజూరుచేస్తోంది. 2017లో ఏయూకు రూ.100 కోట్లు కేటాయించింది. ఈ మొత్తంలో కేంద్రం వాటా రూ.60 కోట్లు కాగా, రాష్ట్ర వాటాగా రూ.40 కోట్లు మ్యాచింగ్ గ్రాంటును ఇవ్వాల్సి ఉంటుంది.

డీపీఆర్‌లో పేర్కొన్న అంశాలపైనే వెచ్చించాలి

రూసా 2.0 నిధులు ఎటువంటి కార్యకలాపాలకు (కాంపోనెంట్స్) ఖర్చు చేస్తారన్న వివరాలతో కూడిన డీపీఆర్‌ను వర్సిటీ అధికారులు అందించారు. డీపీఆర్‌లో పేర్కొన్న కాంపోనెంట్స్‌పై మాత్రమే నిధులు వెచ్చించాలి. డీపీఆర్‌లో పేర్కొన్న దాని ప్రకారం వర్సిటీలో బాయ్స్, గర్ల్స్ హాస్టల్స్ నిర్మాణానికి రూ.7.32 కోట్లు, డ్రైనేజీ సదుపాయాల కల్పనకు రూ.3 కోట్లు, భవనాల ఆధునికీకరణకు రూ.3 కోట్లు, ఆర్ అండ్ డి బిల్డింగ్ నిర్మాణానికి రూ.8.45 కోట్లు, న్యూ ఎంబీఏ ప్రోగ్రామ్ అమలుకు రూ.15 కోట్లు, పేటెంట్స్ కోసం రూ.3 కోట్లు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ల నిర్వహణకు రూ.3 కోట్లు, ఫారిన్ ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్‌కు రూ.4 కోట్లు, అవుట్‌రీచ్ ప్రోగ్రామ్స్ నిర్వహణకు రూ.50 లక్షలు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సెంటర్ ఏర్పాటుకు రూ.5 కోట్లు, డ్రగ్ అండ్ టెస్టింగ్ లేబొరేటరీలో సిబ్బంది నియామకానికి, జీతభత్యాలకు రూ.1.5 కోట్లు, స్టార్టప్ అండ్ రీసెర్చ్ గ్రాంట్ ఫర్ ఫ్యాకల్టీకి రూ.5 కోట్లు, ఎక్సటెన్షన్ ఔట్ రీచ్ యాక్టివిటీస్‌కు రూ.5 కోట్లు, ఎంటర్‌ప్రైజెస్ రీసోర్స్ ప్లానింగ్‌కు రూ.10 కోట్లు, రీసెర్చ్ వర్క్‌లు, ఇతర కార్యలకాపాల నిర్వహణకు మిగిలిన మొత్తాన్ని వెచ్చించాలి.

అయితే, కేంద్రం నిధులు అందించేందుకు ముందుకువచ్చినా రాష్ట్రంలో పాలకులు మ్యాచింగ్ గ్రాంటు విడుదల చేయకపోవడంతో ఆ నిధులను పూర్తిగా వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఎనిమిదేళ్లు దాటినా కేంద్రం ఇచ్చిన రూ.60 కోట్లలో ఇప్పటివరకూ రూ.25 కోట్లు మాత్రమే వినియోగించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన మ్యాచింగ్ గ్రాంటు కింద వర్సిటీ బడ్జెట్ నుంచి సుమారు రూ.15 కోట్లు వెచ్చించి రూసా నిధులు మురిగిపోకుండా జాగ్రత్తపడుతూ వచ్చారు. ఇప్పటివరకూ డైనేజీల నిర్మాణం, ఓల్డ్ బిల్డింగ్ ఆధునికీకరణ, ఆర్ అండ్ డి బిల్డింగ్ నిర్మాణం, న్యూ ఎంబీఏ ప్రోగ్రామ్ అమలు, కాన్ఫరెన్స్‌ల నిర్వహణ వంటి కాంపోనెంట్స్‌పై రూ.40 కోట్లను ఖర్చు చేశారు.

తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మ్యాచింగ్ గ్రాంటు విడుదల చేసేందుకు సన్నద్ధం కావడంతో సుమారు రూ.30 కోట్లు పనులను పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే పూర్తిచేసిన పనులకు సంబంధించి సుమారు రూ.15 కోట్ల వరకూ బిల్లులను చెల్లించాలనుకున్నారు. మరో రూ.15 కోట్లతో ఇతర పనులు చేపట్టాలనుకున్నారు. అయితే, ఆ రూ.30 కోట్ల విడుదలకు కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయి. అందులో రూ.25 కోట్లు ఫారిన్ ఫ్యాకల్టీ పోస్టులను భర్తీ, ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించడం, స్టార్టప్ అండ్ రీసెర్చ్ గ్రాంట్స్ ఫర్ ఫ్యాకల్టీ ప్రోగ్రామ్, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ వంటి వాటి నిర్వహణకు వెచ్చించాల్సి ఉంది. ఇవన్నీ ఇప్పటికిప్పుడు చేసే అవకాశం లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు ఇచ్చేందుకు ముందుకువచ్చినా, నిధుల విడుదలపై సందిగ్ధం నెలకొంది. ప్రత్యేక చొరవ తీసుకోనట్టయితే ఆ రూ.30 కోట్లు మురిగిపోయే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఏడాది మార్చిలోగా రూసా 2.0 నిధులు వినియోగించుకోవాలని, లేదంటే కేంద్రం నుంచి భవిష్యత్తులో రావాల్సిన నిధులు నిలిపివేస్తామని ఇప్పటికే కేంద్రం మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది.వీటికి వెచ్చించిన అధికారులు..

రూసా నిధులతో వర్సిటీలను అభివృద్ధి చేస్తామని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఏయూలో నెలకొన్న ఇబ్బందులను అప్పట్లోనే ఆయన దృష్టికి వర్సిటీ అధికారులు తీసుకువెళ్లి ఉన్నట్టయితే ఇప్పుడు సమస్య ఉత్పన్నమయ్యేది కాదని చెబుతున్నారు. ఈ ప్రభావం పీఎం ఉషా ప్రోగ్రామ్ కింద కేంద్రం మూడో విడతలో ఇవ్వాల్సిన నిధులపై పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

# అధికారంలో ఉన్నా లేకపోయినా జనం జగన్ వెంటే ఉన్నారన్న సజ్జల

**నమస్తే హైదరాబాద్ :**జగన్ తన ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఎంత మేలు చేయాలో అంతా చేశారని, మళ్లీ అధికారంలోకి రాగానే చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా ఆయనకు స్పష్టమైన ప్రణాళిక ఉందని ఆ పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లి సమీపంలోని కుంచనపల్లిలో జరిగిన జగన్ పుట్టినరోజు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి, అనంతరం మీడియాతో మాట్లాడారు.అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజలు జగన్ వెంటే ఉంటారని సజ్జల ధీమా వ్యక్తం చేశారు.ప్రజలకు మేలు చేసేది జగన్ ఒక్కరేనని కోట్లాది మంది నమ్ముతున్నారు. అందుకే తన ఐదేళ్ల పాలనలో అందరికీ మేలు చేశారు. ఏదో ఆశించి ఆయన సహాయం చేయరు. తన వల్ల ప్రజలకు ఎంత మంచి జరుగుతుందనే నిత్యం ఆలోచిస్తారు అని తెలిపారు. ఓదార్పు యాత్ర సమయంలోనూ, కరోనా కష్టకాలంలోనూ జగన్ ప్రజలకు అండగా నిలిచిన తీరును సజ్జల గుర్తుచేశారు.జగన్ ఏనాడూ పబ్లిసిటీ కోరుకోలేదని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి కాలనీలు సృష్టించారని, 17 మెడికల్ కాలేజీలు, పోర్టులు, హార్బర్లు వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ప్రచారం చేసుకోలేదని అన్నారు.



# చిట్టిబుర్రలు.. భలే ఆవిష్కరణలు!

**కాకినాడలో జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన**

**ఆకట్టుకున్న విద్యార్థులు**

**172 ప్రాజెక్టుల ప్రదర్శన**

**ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి**



**నమస్తే హైదరాబాద్ :** కాకినాడ రూరల్, డిసెంబరు 20 : కాకినాడలోని సాలిపేట పైండా సత్తిరాజు మున్సిపల్ బాలికోన్నత పాఠశాల్లో శనివారం పాఠశాలల విద్యార్థులకు జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన– 2025ను జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులతో తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రదర్శన ప్రారంభోత్సవ కార్యక్రమానికి డీఈవో పిల్లి రమేష్ అధ్యక్షత వహించగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న కాకినాడ మున్సిపల్ కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ సైన్స్ లోగోను ఆవిష్కరించగా సైన్స్‌అధికారి జిల్లా సైన్స్ రిపోర్టును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు బా గా రాణించి రాష్ట్రంలోనే కాకినాడ జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలని దానికోసం అవసరమైన సహకారాన్ని అందిస్తానని తెలిపారు. ఇటువంటి ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. డీఈవో మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులను సైన్స్ పట్ల ఆకర్షితులయ్యేలా బోధిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. మం డలస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు 172 ప్రాజెక్టులతో ఈ ప్రదర్శనకు హాజరయ్యారన్నారు. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఈనెల 23,24 తేదీల్లో విజయవాడలోని మురళీ రిసార్ట్స్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని డీఈవో తెలిపారు. జిల్లాలోని 21 మండలాల నుంచి హాజరైన విద్యార్థులు, గైడ్‌ల సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కర్రి పద్మ శ్రీ హాజరై ప్రథమ, ద్వితీయ విజేతలకు మెమొంటోలు, ప్రతిభాపత్రాలను అందజేశారు. ఆమె మా ట్లాడుతూ చిట్టిబుర్రలు భవిష్యత్ ఆవిష్కరణలకు నెలవులు అన్నారు. కార్యక్రమంలో డీవైఈవోలు కేవీవీ సత్యనారాయణ, ఈ.ప్రభాకరశర్మ, ఎంఈవోలు సీహెచ్ రవి, టి.సుబ్బారావు, టీ వీఎస్ రంగారావు, శ్రీనివాసకుమార్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రదర్శనలు

7 అంశాలు, 9 సబ్జెక్టుల్లో ఈ పోటీలు నిర్వహించగా జి.శివజ్యోతి, జె.నవ్య, డి.రేవతి, కె.పల్ల విలాస్య, టి.గంగా భవానీ, ఆశాజ్యోతి, ప్రకృతి, శివదుర్గ, వినయ్‌తేజ, భారతి, రమణమూర్తి ప్రదర్శనలు ప్రథమస్థానాన్ని సాధించాయి. నాగశ్రీవల్లీ, సాత్విక, డీజీ వీరలక్ష్మీ, యశోద, జెస్సికా, ఎన్ఎస్‌దేవి, నాగేశ్వరి ప్రదర్శనలు ద్వితీయ స్థానాన్ని పొందాయి.

# ఏపీని ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా మారుస్తా,,,, సీఎం చంద్రబాబు



**నమస్తే హైదరాబాద్ :** 2026 జూన్ నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా మారుస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శనివారం రోజున సీఎం చంద్రబాబు అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలో పర్యటించారు. తాళ్లపాలెంలో జరిగిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన చంద్రబాబు.. వచ్చే జూన్ నాటికి రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా మారుస్తామని ప్రకటించారు. అయితే అందుకు ప్రజా భాగస్వామ్యం అవసరమని అన్నారు. వైసీపీ ప్రభుత్వం వదిలి వెళ్లిన సుమారు 86 లక్షల టన్నుల చెత్తను తొలగించినట్లు చంద్రబాబు వివరించారు. చెత్తను సంపదగా మార్చాలనే ఉద్దేశంతో రీసైక్లింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం నాటికి రాష్ట్రంలోని రోడ్లపై చెత్త కనిపించకూడదని అధికారులను ఆదేశించారు. మరోవైపు ఏపీ ప్రభుత్వం పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా స్వచ్ఛ రథాలను తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. స్వచ్ఛ రథాల సాయంతో గ్రామాల్లోని ఇళ్ల వద్దకు వెళ్లి చెత్తను సేకరిస్తున్నారు. అలాగే చెత్తకు బదులుగా సరుకులను ఉచితంగా అందిస్తున్నారు. ఈ స్వచ్ఛరథం ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా కొన్నిచోట్ల ప్రవేశపెట్టారు. ఆయా ప్రాంతాల్లో మంచి స్పందన లభించడంతో ప్రస్తుతం 26 చోట్ల ఈ స్వచ్ఛ రథాలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో అవసరమైతే 100 ప్రాంతాల్లో స్వచ్ఛ రథాలు ఏర్పాటు చేసి పొడి చెత్తను సేకరిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు.ఇక ఇళ్లల్లోని పొడి చెత్తను రోడ్లపై వేయడం మానుకోవాలని చంద్రబాబు సూచించారు. పొడిచెత్తకు కూడా డబ్బులు ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. రోడ్లు కూడా మనవేననే సంగతి ప్రజలు గుర్తుంచుకోవాలని అన్నారు. ఇంట్లో చెత్తను కంపోస్ట్‌గా తయారు చేసుకోవచ్చన్న చంద్రబాబు.. రాబోయే రోజుల్లో పట్టణాల్లో 5 లక్షల ఇళ్లు, గ్రామాల్లో 10 లక్షల ఇళ్లల్లో ఇలాంటి కంపోస్ట్ తయారు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మరోవైపు అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించిన చంద్రబాబు.. ఏపీ పాఠశాలల్లో ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడి విద్యార్థినులతో ముచ్చటించారు. ముస్తాబు కార్యక్రమం ద్వారా విద్యార్థుల వ్యక్తిగత శుభ్రత పాటించే విధానాలను స్వయంగా పరిశీలించారు.

# సినిమా



## నేను 21 ఏళ్లకే వచ్చేసాను..

స్వప్న సినిమాస్ అప్ కమింగ్ మూవీ 'ఛాంపియన్' ఆసక్తికరమైన ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణ లో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. మిక్కీ జే మేయర్ అందించిన పాటలు చార్ట్ బస్టర్ అయ్యాయి. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో రోషన్ విలేకరలు సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో రామ్ చరణ్ గారు మిమ్మల్ని చాలా ప్రశంసించారు కదా.. ఎలా అనిపించింది.? అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. చాలా ఆనందంగా ఉంది. చరణ్ అన్న నాకు చిన్నప్పటి నుంచి తెలుసు. నా గురించి మా సినిమా గురించి టీం గురించి ఆయన చాలా బాగా మాట్లాడారు. నిజంగా చాలా సంతోషంగా ఉంది. 1948లో జరిగే కథ ఇది.. యాక్షన్ డ్రామా వార్ అన్ని చాలా గ్రాండ్ గా ఉంటాయి. చరిత్రలో బైరాన్ పల్లి గురించి చాలామందికి తెలుసు. అందులో మైఖేల్ అనే ఒక ఫిక్షనల్ క్యారెక్టర్ ని క్రియేట్ చేసి ఈ కథని ప్రజెంట్ చేయడం జరిగింది. నేను మామూలుగా తెలుగు మాట్లాడతాను. అయితే ఈ క్యారెక్టర్ ప్రాపర్ హైదరాబాది. ఆ యాస స్పష్టంగా నేర్చుకోవడం జరిగింది. మా డైరెక్టర్ హెల్ప్ తో పాటు వర్క్ షాప్స్ కూడా చేశాం అన్నారు రోషన్.

నిజానికి హీరోలందరూ 25 ఏళ్లు ఏజ్ లోనే వస్తారు. నేను 21 ఏళ్లకే వచ్చేసాను. బ్రేక్ లాగా అనిపిస్తుంది కానీ కరెక్ట్ ఏజ్ ఇదే. కం బ్యాక్ ఇవ్వడానికి ఇదే కరెక్ట్ ఏజ్. ఈ గ్యాప్ తీసుకోవడం కూడా కంప్లీట్ గా నా నిర్ణయమే. యాక్టింగ్ అంటే చాలా హ్యూమన్ ఎమోషన్స్ తెలియాలి. దానికి ఒక మెచ్యూరిటీ కావాలి. ఈ మూడేళ్లలో చాలా ట్రావెల్ చేశాను. చాలా నేర్చుకున్నాను. ఈ మూడేళ్లు చాలా హ్యాపీగా జరిగింది. ఇండియాకి స్వతంత్రం వచ్చిన తర్వాత ఇంకా హైదరాబాద్ కి స్వతంత్రం రాని రోజుల్లో జరిగిన కథ ఇది. మా డైరెక్టర్ గారు అన్ని రిఫరెన్సులు ఇచ్చారు. స్వప్న గారు చాలా పర్టికులర్ గా ఉంటారు. డైరెక్టర్ గారు, స్వప్న గారు, ఆర్ డైరెక్టర్ తోట గారు ప్రతిదీ రీసెర్చ్ చేశారు. ఆ కాలంలో ఎలా ఉండేవారు డైరెక్టర్ గారు ప్రతీది కేర్ తీసుకుని చేశారు. ఈ సినిమా కోసం చాలా వర్క్ షాపులు కూడా చేశాము. ఇందులో అద్భుతమైన డ్రామా ఉంది. ప్రతి దానికి ఒక కనెక్షన్ ఉంటుంది. హాలీవుడ్ లో స్పైడర్ మాన్ లాంటి సినిమాలు దాదాపు 3000 కోట్లు పెట్టి తీస్తారు కానీ అందులో ఒక కొత్త నటుడు ఉంటాడు. ఖర్చు పెట్టేది సినిమా మీద. అంత స్ట్రాంగ్ సబ్జెక్టు ఉంది కాబట్టే అంత పెట్టారు. ఒత్తిడి ఉంటుంది. అయితే నేను దృష్టి పెట్టాల్సింది యాక్టింగ్ పైనే. నేనొక్కడినే కాదు బైరాన్ పల్లి గ్రామంలో ప్రతి క్యారెక్టర్ కి ఇంపార్టెన్స్ ఉ ంటుంది. ప్రతి క్యారెక్టర్ కి ఒక ప్రారంభం ముగింపు ఉంటుంది. ఇక తర్వాత సినిమాల గురించి మాట్లాడుతూ.. ఈసారి ఎక్కువ గ్యాప్ లేకుండా కనీసం రెండు సంవత్సరాలకి మూడు సినిమాలు చేయాలని అనుకుంటున్నాను అని చెప్పుకొచ్చారు రోషన్.





## బ్రోకలీ రోజూ తింటే ఏమవుతుందో తెలుసా..? పంబరేపే బెనిఫిట్స్..

చూసేందుకు కాలీఫ్లవర్ లాగా కనిపించే బ్రోకలీ పోషకాల పవర్ హౌస్. ఆకుపచ్చ కూరగాయలో ఒకటైన బ్రోకలీ మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బ్రోకలీలో యాంటీఆక్సిడెంట్లు, ఖనిజాలు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యంతో పాటు అందానికి కూడా అనేక విధాలుగా ప్రయోజనం చేకూరుస్తాయి. బ్రోకలీలో యాంటీ ఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. ముఖ్యంగా ఇందులో ఉంటే సల్ఫోరఫేన్ అనే సమ్మేళనం ఫ్రీ రాడికల్స్ వల్ల శరీర కణాలు డ్యామేజ్ కాకుండా కాపాడుతుంది. తద్వారా క్యాన్సర్ వంటి మహమ్మారి రాకుండా అడ్డుకోవచ్చు.బ్రోకలీలో గ్లుకోసినోలేట్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి శరీరంలోని విషపదార్థాలను బయటకు పంపడంలో సహాయపడతాయి. తద్వారా కాలేయంపై ఒత్తిడి తగ్గుతుంది. లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. బ్రోకలీలో కాల్షియం, విటమిన్ కె వంటి పోషకాలు ఉ ంటాయి. ఇవి ఎముకలకు కావాల్సినంత బలం అందిస్తాయి. తద్వారా వయసు పెరిగినా ఎముకలు బలంగా ఉంటాయి. బ్రోకలీలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తద్వారా అనేక రకాల ఇన్ఫెక్షన్లకు దూరంగా ఉండొచ్చు.

బ్రోకలీలో డైటరీ ఫైబర్ మెండుగా ఉంటుంది. ఇది పేగులను ఆరోగ్యంగా ఉంచి మలబద్ధకం ఏర్పడకుండా కాపాడుతుంది. అలాగే కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యల నుంచి ఉపశమనం కల్పిస్తుంది. అయితే పచ్చిగా తింటే మాత్రం జీర్ణ సమస్యలు వస్తాయి. బ్రోకలీలో పొటాషియం, ఫైబర్, ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ వంటి గుండెకు మేలు చేసే పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి రక్తపోటు అదుపులో ఉంచి హృదయ సంబంధ సమస్యలు రాకుండా కాపాడుతాయి.



## రోజూ ఇవి రెండు తింటే చాలు..

బిజీ లైఫ్‌లో చాలా మంది ఆరోగ్యంపై పెద్దగా శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవడం కొంచెం సవాలుగా ఉ న్నప్పటికీ, ఎంతటి బిజీ జీవితంలోనైనా మీ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. మీ ఉదయం అలవాట్లలో ఒక చిన్న మార్పు చేసుకోవడం ద్వారా రోజంతా ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉండవచ్చు. ప్రకృతి మనకు అందించిన అద్భుతమైన పండ్లలో ఖర్జూరం ఒకటి. ఖర్జూరం ఫైబర్, పొటాషియం, మెగ్నీషియం, సహజ చక్కెరలు, శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లకు నిలయం. కాఫీ, టీ బదులుగా కేవలం రెండు ఖర్జూరాలు తినటం వల్ల అద్భుతమైన ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.నిరంతరం కెఫిన్ లేదా ఇతర అనారోగ్యకరమైన పదార్థాలను తీసుకునే బదులు, ఉదయం ఖాళీ కడుపుతో కేవలం రెండు ఖర్జూరాలు తినాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఆమె ప్రకారం, ప్రతి రోజూ రెండు ఖర్జూరాలు తినటం వల్ల మీ శరీరానికి నాలుగు కీలక విధాలుగా ప్రయోజనం చేకూరుతుంది. బిజీగా ఉండి అల్పాహారం దాటవేసే వారికి ఈ ఖర్జూరాలు తక్షణ శక్తిని, పోషణను అందించి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. సాధారణంగా ఉదయం తీసుకునే టీ లేదా కాఫీ ఇచ్చే శక్తి తాత్కాలికమే. కొంతకాలం తర్వాత శక్తి తగ్గిపోయి నిస్సత్తువ ఆవరిస్తుంది. కానీ, మీరు రెండు ఖర్జూరాలు తింటే, అవి మీకు రోజంతా నిలకడగా ఉండే శక్తిని అందిస్తాయి. క్రిటికల్ రివ్యూస్ ఇన్ ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్ నివేదిక ప్రకారం, ఖర్జూరాలలో మూడు రకాల సహజ చక్కెరలు ఉన్నాయి. అవి గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సుక్రోజ్. వీటిని శరీరం సమర్థవంతంగా వినియోగించుకుని శక్తిగా మారుస్తుంది. ఈ అలవాటు అనవసరమైన ఆకలిని లేదా తీపి తినాలనే కోరికలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఖర్జూరంలోని అధిక ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియ ప్రక్రియను నెమ్మదిస్తుంది. దీనివల్ల ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉన్న అనుభూతి కలుగుతుంది. ఇది అల్పాహారానికి ముందు అనవసరంగా చిరుతిళ్లు తినకుండా నియంత్రిస్తుంది.ఆరోగ్యకరమైన జీర్ణక్రియను నిర్వహించడంలో ఫైబర్ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రతిరోజు రెండు ఖర్జూరాలు తినడం వల్ల ప్రేగు కదలికలు సులభతరం అవుతాయి. మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. భోజనం తర్వాత వచ్చే తేలికపాటి అసౌకర్యం కూడా తగ్గుతుంది. మీ ఉదయం ప్రారంభాన్ని ఆరోగ్యకరంగా మార్చుకోవడానికి ఈ చిన్న మార్పును ప్రయత్నించండి. కాఫీ లేదా ప్రాసెస్ చేసిన అల్పాహారాల స్థానంలో కేవలం రెండు ఖర్జూరాలను తీసుకోవడం ద్వారా రోజంతా ఉల్లాసంగా, ఆరోగ్యంగా ఉండటంతోపాటు జీర్ణవ్యవస్థను కూడా పటిష్టం చేసుకోవచ్చు. ఈ విధంగా, ఖర్జూరాలు మీ దైనందిన జీవితంలో ఒక భాగమై, ఆరోగ్యకరమైన జీవనశైలికి పునాది వేస్తాయి.

## హిస్టరీ రిపీట్ అవుతుందా?

టీ20 ప్రపంచకప్ 2026 కోసం భారత జట్టు ప్రకటనతో క్రికెట్ ఫీవర్ అప్పుడే మొదలైపోయింది. ఫిబ్రవరి 7 నుంచి భారత్, శ్రీలంక వేదికలుగా జరగనున్న ఈ మెగా టోర్నీలో టీమిండియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. గత ఏడాది (2024) ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా ట్రోఫీని ముద్దాడిన భారత్, ఈసారి సొంత గడ్డపై కప్పును నిలబెట్టుకోవాలని పట్టుదలతో ఉంది. ఇప్పటివరకు టీ20 వరల్డ్ కప్ చరిత్రలో ఏ జట్టు కూడా వరుసగా రెండుసార్లు విజేతగా నిలవలేదు. మరి సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో భారత్ ఆ రికార్డును తిరగరాస్తుందా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.ప్రపంచకప్ చరిత్రను ఒకసారి గమనిస్తే.. భారత్ ఇప్పటివరకు రెండుసార్లు (2007, 2024) విజేతగా నిలిచింది. ఇంగ్లాండ్, వెస్టిండీస్ జట్లతో కలిసి రెండుసార్లు ట్రోఫీ గెలిచిన అతికొద్ది జట్ల జాబితాలో భారత్ ఒకటి. 2007లో ధోనీ సారథ్యంలో తొలి కప్పును గెలిచిన టీమ్ ఇండియా, ఆ తర్వాత 2014లో రన్నరప్‌గా, 2016, 2022లో సెమీఫైనలిస్ట్‌గా నిలిచింది. గత 9 ఎడిషన్లలో పాల్గొన్న భారత్, అత్యంత విజయవంతమైన జట్టుగా గుర్తింపు పొందింది.

గణాంకాల పరంగా చూస్తే టీమిండియా రికార్డులు అద్భుతంగా ఉన్నాయి. ఇప్పటివరకు ఆడిన 52 మ్యాచ్‌లలో భారత్ 36 సార్లు విజయం సాధించగా, కేవలం 15 సార్లు మాత్రమే ఓటమిని చవిచూసింది. ఒక మ్యాచ్ ఫలితం తేలలేదు. ముఖ్యంగా పాకిస్థాన్‌పై భారత్‌కు తిరుగులేని రికార్డు ఉంది. ఆ జట్టును ఇప్పటివరకు 7 సార్లు ఓడించింది. ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా వంటి దిగ్గజ జట్లపై కూడా భారత్ పైచేయి సాధించింది. అయితే శ్రీలంక, న్యూజిలాండ్ జట్లు మాత్రం వరల్డ్ కప్ వేదికలపై భారత్‌కు గట్టి సవాలుగా నిలుస్తూ వస్తున్నాయి.ఈసారి జరగబోయే 2026 ప్రపంచకప్ ఒక కొత్త శకానికి నాంది పలకనుంది. గత 18 ఏళ్లలో తొలిసారిగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి దిగ్గజాలు లేకుండా భారత్ ఐసీసీ టోర్నీలో బరిలోకి దిగుతోంది. టీ20 వరల్డ్ కప్ ప్రారంభమైనప్పటి నుంచి (2007) అన్ని ఎడిషన్లలో ఆడిన ఏకైక ఆటగాడు రోహిత్ శర్మ. ఇప్పుడు ఆ బాధ్యతను యువ రక్తం భుజానికెత్తుకోనుంది. అనుభవం లేకపోయినా, దూకుడున్న కుర్రాళ్లతో భారత్ హ్యాట్రిక్ దిశగా అడుగులు వేస్తోంది.




## తనపై తానే సెటైర్ వేసుకున్న టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్

భారత్ - దక్షిణాఫ్రికా మధ్య జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను టీమిండియా 3 - 1తో గెలుచుకున్నప్పటికీ, 2026 టీ20 వరల్డ్ కప్‌కు ముందు పరిష్కరించాల్సిన అంశాలు ఇంకా ఉన్నాయని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు. ముఖ్యంగా తన బ్యాటింగ్ ఫామ్‌పై సూర్య స్వయంగా విమర్శలు చేసుకోవడం ఆసక్తికరంగా మారింది.

2025 క్యాలెండర్ ఏడాదిలో సూర్యకుమార్ యాదవ్ ఒక్క అర్ధశతకం కూడా చేయలేకపోయాడు. ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యుత్తమ టీ20 బ్యాటర్లలో ఒకడిగా గుర్తింపు పొందిన సూర్య, ఈ ఏడాది సగటు 14 కంటే తక్కువగా నమోదు చేయడం అతని కెరీర్‌లోనే కష్టకాలంగా నిలిచింది.

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఆఖరి టీ20 మ్యాచ్ అనంతరం మాట్లాడిన సూర్యకుమార్, తన ఫామ్‌పై నిజాయితీగా స్పందించాడు. "బహుశా ఈ సిరీస్‌లో మనం పూర్తిగా సాధించలేకపోయిన ఒక్క విషయం బ్యాటర్ సూర్యను కనిపెట్టలేకపోవడమే! ఎక్కడో మిస్ అయ్యాడు. కానీ తప్పకుండా బలంగా తిరిగి వస్తాడు. జట్టుగా మాత్రం నేను చాలా సంతోషంగా ఉన్నాను," అని సూర్య వ్యాఖ్యానించాడు. "మనం కష్టాల్లో ఉన్న ప్రతిసారి ఎవరో ఒకరు ముందుకొచ్చి జట్టును గట్టెక్కించారు. కెప్టెన్‌గా ఇది నాకు చాలా తృప్తినిచ్చింది," అని అతను చెప్పాడు.

2025లో సూర్యకుమార్ యాదవ్ అత్యధిక స్కోర్ 47 నాటౌట్ మాత్రమే. ఈ స్కోర్ పాకిస్తాన్‌తో జరిగిన ఆసియా కప్ గ్రూప్ మ్యాచ్‌లో నమోదైంది. అంతేకాదు, అతని స్ట్రయిక్ రేట్ కూడా ఆశించిన స్థాయిలో లేకపోయి 117.87గా నిలిచింది. ఈ ఏడాది సూర్య ఆడిన 20 మ్యాచ్‌ల్లో కేవలం 218 పరుగులే సాధించాడు. .

అయితే, ఐపీఎల్ 2025లో ముంబై ఇండియన్స్ తరఫున సూర్య కుమార్ యాదవ్ అద్భుత ఫామ్ చూపించాడు. ఆ సీజన్‌లో 717 పరుగులు సాధించినప్పటికీ, అదే జోరును టీ 20 అంతర్జాతీయాల్లో కొనసాగించలేకపోయాడు. వరల్డ్ కప్‌కు ముందు చివరి అసైన్‌మెంట్‌గా ఉన్న న్యూజిలాండ్‌తో సిరీస్‌లో అయినా సూర్య కుమార్ యాదవ్ ఫామ్‌లోకి రావాలని అభిమానులు ఆశిస్తున్నారు.




Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..